Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 263 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ శనివారం18-10-2025 పేజీలు : 12 వెల : 2/-



**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375


## పార్టీ కోసం ఆస్తులు అమ్మినా, అయినా మోసం చేసింది

-కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మంత్రి పదవి విషయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి బరస్ట్ అయ్యారు.పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుని కష్టపడి పనిచేశానని పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి రాకుండా కొందరు అడ్డుకుంటున్నారంటూ ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి నాతోపాటు బీజేపీ నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చి తనను పక్కనపెట్టారంటూ మండిపడ్డారు. ప్రస్తుతం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యవహారం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే కొండా సురేఖతోపాటు కొందరి మంత్రుల మధ్య జరుగుతున్న విభేదాల నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

## హైదరాబాద్‌లోని పలు ఫారెక్స్ సంస్థల్లో ఈడీ తనిఖీలు




-ఆర్బీఐ లైసెన్స్ లేకుండా సంస్థలను నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు

హైదరాబాద్ నగరంలోని పలు ఫారెక్స్ సంస్థలపై ఈడీ అధికారులు దాడులు నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి లైసెన్స్ లేకుండానే ఈ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయనే ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ప్రిజమ్, గరుడ, విక్టరీ, విమల్‌నాథ్ ఫారెక్స్ సంస్థల్లో ఈడీ అధికారులు సోదాలు జరిపారు. గతంలో ఆర్బీఐ అధికారులు జరిపిన సోదాల్లో ఈ సంస్థల్లో అవకతవకలు వెలుగుచూడటంతో, ఈడీ కూడా తనిఖీలు చేపట్టింది. ఆర్బీఐ అనుమతులు

మిగతా 2లో

## స్థానిక ఎన్నికలు ఎప్పుడు.?

# రెండు వారాల్లో చెప్పండి

## ప్రభుత్వానికి, ఈసీకి తెలంగాణ హైకోర్టు ఆదేశం




హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో రెండు వారాల్లోగా స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం, ఎన్నికల సంఘం కలిసి చర్చించుకుని ఒక నిర్ణయానికి రావాలని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు కొట్టివేయడంతో, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం ఇటీవల నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈసీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సురేందర్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా, సుప్రీంకోర్టు కూడా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని చెప్పింది కదా అని హైకోర్టు గుర్తు చేసింది.దీనిపై ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది స్పందిస్తూ, సుప్రీంకోర్టు కేవలం మౌఖికంగా మాత్రమే చెప్పిందని, లిఖితపూర్వక ఆదేశాల్లో ఆ ప్రస్తావన లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చామని, అది చెల్లకపోవడంతోనే నిలిపివేశామని వివరించారు. రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వంతో చర్చించి, స్పష్టత వచ్చిన తర్వాతే కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయగలమని తెలిపారు. ఈ ప్రక్రియ కోసం కొంత సమయం అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు రెండు వారాల సమయం కోరడంతో, హైకోర్టు అంగీకరిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఆ లోగా ఎన్నికల తేదీలపై ఒక స్పష్టమైన నిర్ణయంతో రావాలని నిర్దేశించింది.



## భారతదేశ పురోగతికి నదులే రహదారులు

-ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ భారతదేశ నదులు కేవలం వారసత్వ చిహ్నాలు మాత్రమే కావని, అవి దేశ ప్రగతికి కొత్త రహదారులుగా మారాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. గత కొన్నేళ్లుగా దేశంలో జలమార్గాలను అభివృద్ధి చేయడం ద్వారా రవాణా, పర్యాటక రంగాలు బలోపేతం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ రాసిన ఒక ప్రత్యేక కథనాన్ని ప్రధాని శుక్రవారం తన 'ఎక్స్' సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "వికసిత్ భారత్ నిర్మాణం దిశగా పునరుజ్జీవం పొందిన మన జలమార్గాలు ఎలా పయనిస్తున్నాయో" వివరిస్తూ సోనోవాల్ ఈ వ్యాసాన్ని రాశారు. ఒకప్పుడు మన దేశంలో నదులే ప్రధాన రవాణా మార్గాలుగా ఉండేవని, రోడ్లపై ట్రక్కుల హవా పెరగకముందే పట్నా, దిబ్రూగఢ్ వంటి ప్రాంతాల నుంచి కోల్‌కతాకు సరుకులు నదుల మీదుగానే చేరేవని సోనోవాల్ గుర్తుచేశారు. "భారత నదులే మన తొలి హైవేలు. కాలక్రమేణా రైలు, రోడ్డు మార్గాలు రావడంతో వాటి ప్రాధాన్యం తగ్గింది" అని ఆయన తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం, భారత అంతర్గత జలమార్గాల ప్రాధికార సంస్థ (ఐడబ్ల్యూఏఐ) కృషితో ఇప్పుడు నదులకు మళ్లీ పూర్వ వైభవం వస్తోందని సోనోవాల్ వివరించారు. 2014 వరకు దేశంలో కేవలం 5 జాతీయ జలమార్గాలు మాత్రమే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 111కి పెరిగిందని, వీటిలో 32 ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఆయన వెల్లడించారు. ఈ మార్పు వల్ల తక్కువ ఇంధన వినియోగం,

మిగతా 2లో



## నేడు తెలంగాణలో బీసీ సంఘాల బంద్

-42శాతం రిజర్వేషన్ల డిమాండ్

-ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ సీఎస్

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గంలో త్వరలో జరగనున్న ఉప ఎన్నిక దృష్ట్యా అధికార యంత్రాంగం కీలక ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ల అంశంపై నిరసనలు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ నవంబర్ 11వ తేదీన జరగనుంది. ఈ సందర్భంగా ఆ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

మిగతా 2లో

## మైనింగ్ లీజుల్లో వడ్డెర్లకు 15 శాతం రిజర్వేషను



-సీనరేజి, ప్రీమియంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయం

-రాష్ట్ర ఖనిజ సంపదపై పూర్తిస్థాయి అధ్యయనానికి సీఎం ఆదేశం

-గనుల తవ్వకాలపై శాటిలైట్, డ్రోన్లతో పటిష్ఠ నిఘా

-పెండింగ్‌లో ఉన్న 6,500 మైనింగ్ దరఖాస్తులకు గ్రీన్ సిగ్నల్

2



## ఖరీఫ్ రైతులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

-27 నుంచి కొనుగోళ్లు మొదలు

2

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి భారీ ఊరట

-ఏసీబీ కోర్టు కీలక ఉత్తర్వులు



2లో

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

-తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి కీలక సూచనలు




2లో

## 78 యంగ్ ఇండియా స్కూళ్లకు ఆమోదం

-రూ.15,600 కోట్లతో నిర్మించేందుకు నిర్ణయం




2

సత్యమేవ జయతే



# మైనింగ్ లీజుల్లో వడ్డెర్లకు 15 శాతం రిజర్వేషన్లు

అమరావతి రాష్ట్రంలో వడ్డెర సామాజిక వర్గానికి ఆర్థికంగా చేయూతనిచ్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మైనింగ్ లీజుల కేటాయింపులో వారికి 15 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అవసరమైన విధానాన్ని తక్షణమే రూపొందించాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సీనరేజి, ప్రీమియం వంటి చెల్లింపుల్లో వారికి 50 శాతం రాయితీ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి ప్రతిపాదనలు సిద్ధం చేసి, తదుపరి కేబినెట్ సమావేశంలో చర్చకు తీసుకురావాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వడ్డెర్లకు లీజులు కేటాయించడమే కాకుండా, వారిని ఎంఎస్ఎంఈలుగా ప్రోత్సహించేలా ప్రస్తుత పాలసీలతో అనుసంధానం చేయాలని దిశానిర్దేశం చేశారు. వెనుకబడిన వర్గాలైన వడ్డెర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా లీజు కేటాయింపు విధానాన్ని రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. మైనింగ్ లీజుల కేటాయింపుతో పాటు వారు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేందుకు కూడా ప్రస్తుతం ఉన్న పాలసీని అనుసంధానించాలని అన్నారు.

**ఉచిత ఇసుకతో ప్రజలకే ప్రయోజనం దక్కాలి**

ఇక, ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలందరికీ ప్రయోజనం కలగాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరాను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సీజన్ కోసం 66.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేశామని ప్రస్తుతం అన్ని స్టాక్ పాయింట్లలోనూ 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం దక్కేలా ఇసుక లభ్యత జరగాలని అన్నారు. ఇసుక లోడింగ్ తో పాటు రవాణాకు అతితక్కువ వ్యయం అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రూట్లలో పెట్టిన సీసీ కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా ఉచిత పంపిణీ విధానంపై పర్యవేక్షించాలని సీఎం అన్నారు.

**విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం**

రాష్ట్రంలో లభ్యం అవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని సీఎం సూచించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంతో పోలిస్తే 34 శాతం మేర అదనంగా గనుల శాఖ నుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాంగనీస్ లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికి పైగా ఆదాయం వస్తోందని వివరించారు.దీనిపై స్పందించిన సీఎం ఏపీలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని సూచించారు. ఒడిశా లాంటి రాష్ట్రాల్లో వాల్యూ ఎడిషన్ ద్వారా ఎక్కువగా ఆదాయాన్ని పొందుతున్నారని రూ.50 వేల కోట్ల ఆదాయం ఖనిజాల నుంచే వస్తోందని సీఎం తెలిపారు. ఏపీలోనూ అందుకు తగిన విజన్ ప్లాన్ తయారు చేసి విలువ జోడిస్తే రూ.20-30 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పెండింగ్ లో ఉన్న 6500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు.రాష్ట్రంలో గనుల తవ్వకాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇచ్చిన పర్మిట్లు, జరిగిన తవ్వకాలు ఎంత అనేది ఎప్పటికప్పుడు విశ్లేషించాలన్నారు. అనలటిక్స్ ను వినియోగించుకుని జరిగిన తవ్వకాలను అంచనా వేయాలన్నారు. బీచ్ శాండ్ మినరల్స్ లాంటి భార ఖనిజాల మైనింగ్ తో పాటు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. అలాగే కడపలో నిర్మించనున్న స్టీల్ ప్లాంట్ కు ముడి ఇనుము ఖనిజం సరఫరా పై కూడా అధ్యయనం చేయాలని సూచించారు. ఈ సమీక్షకు గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ ఉన్నతాధికారులు ముఖేష్ కుమార్ మీనా, ప్రవీణ్ కుమార్, ఆర్టీజీఎస్ అధికారులు హాజరయ్యారు.

# పార్టీ కోసం ఆస్తులు అమ్మినా, అయినా మోసం చేసింది

హైదరాబాద్ మంత్రి పదవి దక్కకపోవడంతో కొంతకాలంగా అసంతృప్తితో ఉన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇటీవల పార్టీపై, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా ఘాటు విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీని కాపాడేందుకు తన ఆస్తులు అమ్ముకున్నానని కానీ పార్టీ తనను మోసం చేసిందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన నలుగురికి మంత్రి పదవులు ఇచ్చారని చివరికి తనతోపాటు బీజేపీ నుంచి వచ్చిన వివేక్ వెంకటస్వామికి కూడా మంత్రి పదవి దక్కిందని అన్నారు. తనను మాత్రం పక్కన పెట్టారంటూ అసహనం వ్యక్తం చేశారు.

**ఆ నలుగురికి ఇచ్చి నన్ను పక్కనపెట్టారు**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కాపాడేందుకు ఆస్తులు అమ్మినట్లు చెప్పుకొచ్చారు. అయితే పార్టీ తనను మోసం చేసిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని చెప్పుకొచ్చారు. తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరి మంత్రి పదవులు తెచ్చుకున్నారని అలాగే బీజేపీ నుంచి తనతోపాటే పార్టీలోకి వచ్చిన వివేక్ వెంకటస్వామికి సైతం మంత్రి పదవి ఇచ్చారని చెప్పుకొచ్చారు. తనను మాత్రం పక్కన పెట్టారంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రవ్యాఖ్యలు చేశారు.

**జానారెడ్డి అడ్డుకోవడం బాధగా ఉంది**

మంత్రి పదవి ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి, ఇప్పుడు మాట తప్పారంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు.

కాంగ్రెస్‌లోని కొందరు నాయకులే తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నారంటూ ధ్వజమెత్తారు. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ నా మంత్రి పదవి విషయంలో కొందరు రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. గతంలో మాజీమంత్రి జానారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. మహాభారతంలో ధర్మరాజులాగా వ్యవహరించాల్సిన జానారెడ్డి వంటి వారు ప్రస్తుతం ధృతరాష్ట్రుడి పాత్ర పోషిస్తున్నారంటూ మండిపడ్డారు.నా మంత్రి పదవి విషయంలో జానారెడ్డి అడ్డుతగలడం చూసి చాలా బాధగా ఉందన్నారు. పార్టీ కోసం ఎంతో త్యాగం చేసిన తనకు అన్యాయం జరిగిందంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

**ఓపికతో ఎదురుచూస్తున్నా**

ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చారు. ఇచ్చినప్పుడు ఇవ్వండి అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా? అని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో రెండోసారి హామీ ఇచ్చినప్పుడు తెలియదా? అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. 9 మంది ఎమ్మెల్యేలున్న ఖమ్మం జిల్లాకు 3 మంత్రి పదవులు ఇచ్చారు. 11 మంది గెలిచిన నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉంటే తప్పా? అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? ఆలస్యమైనా సరే ఓపిక పడుతున్నా? అంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.

# నేడు తెలంగాణలో బీసీ సంఘాల బంద్

కొనసాగుతోంది. షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ఈ నెల 21 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకుంటారు. 22న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. 24 వరకు ఉపసంహరణకు గడువు ఉంది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహించి, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు జరపనున్నారు. సెలవు రోజులు మినహా మిగిలిన పనిదినాల్లో నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. అభ్యర్థులు కార్యాలయంలో నేరుగా లేదా డిజిటల్ పద్ధతిలో కూడా నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు.

**అక్టోబర్ 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా బంద్**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ సంఘం అక్టోబర్ 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. స్కూల్స్, కాలేజీలతో పాటు పెట్రోల్ బంక్ లు కూడా బంద్ పాటించనున్నాయి. నేడు ఒక్క మెడికల్ షాపులు మినహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని షాపులు మూసివేయనున్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ శివధర్‌రెడ్డి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా బంద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. నిఘా బృందాలు, పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జారీ చేసిన జీవోపై హైకోర్టు అక్టోబర్ 9న స్టే విధించింది. దీనికి వ్యతిరేకంగా బీసీ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. బీసీలు ఇప్పటికీ సామాజిక వివక్షకు గురవుతున్నారని, వారికి సమాన హక్కులు, గౌరవం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కోర్టులు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపిస్తూ, 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పట్టుబడుతున్నారు. రాహుల్ గాంధీ హామీ మేరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన సర్వే నిర్వహించామని కాంగ్రెస్ పేర్కొంది. బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ (బీసీ జేఏసీ) ఈ బంద్‌ను నిర్వహిస్తోంది. జేఏసీ చైర్మన్, బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో ఈ ఆందోళన జరుగుతోంది. ప్రజలు శాంతియుతంగా పాల్గొనాలని, దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేయాలని కోరారు. ఆర్టీసీ బస్సులు నడపకూడదని పిలుపునిచ్చారు.

**అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ**

ఈ బంద్‌కు రాజకీయ పార్టీలు, ఎస్సీ, ఎస్టీ బీసీ సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. బషీర్‌బాగ్ నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ, జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ కోదండరాం, అద్దంకి దయాకర్ వంటి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# 78 యంగ్ ఇండియా స్కూళ్లకు ఆమోదం

హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య వ్యవస్థలో సమూల మార్పుల చేసేందుకు రెడీ అయ్యింది. ఇందుకోసం పలు కీలక సంస్కరణలు అమలు చేస్తోంది. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి మెరుగైన, నాణ్యమైన విద్యను అందించేందుకు సిద్ధమయిన ప్రభుత్వం, ఆ దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా తాజాగా తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది.

రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున మొత్తం 78 యంగ్ ఇండియా గురుకులాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సర్కార్ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 78 చోట్ల యంగ్ ఇండియా గురుకుల కాంప్లెక్సులు నిర్మించాలని నిర్ణయించుకుంది. దీనిలో భాగంగా ఒక్కో కాంప్లెక్సుకు రూ.200 కోట్లు చొప్పున మొత్తం రూ.15,600 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఈ ప్రతిపాదనలకు తాజాగా తెలంగాణ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతో పాటు గురువారం నాటి కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

తెలంగాణ ప్రభుత్వ యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీని కోసం భారీ స్థాయిలో నిధులు ఖర్చు చేసేందుకు సిద్ధం అవుతోంది. దీనిలో భాగంగానే 78 యంగ్ ఇండియా గురుకులాల్లో ఒక్కో కాంప్లెక్సుకు రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.15,600 కోట్లు కేటాయించనుంది. ఆర్థికశాఖ ఇప్పటికే యంగ్ ఇండియా గురకుల కాంప్లెక్స్ నిర్మాణాలకు అవసరమైన పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేసింది. విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ఈ ప్రతిపాదనలను డిప్యూటీ సీఎం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సమర్పించారు. గురువారం నాటి కేబినెట్ భేటీలో దీన్ని ఆమోదించారు.

**వెయ్యి పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు**

ఇదిలా ఉండగా వచ్చే విద్యాసంవత్సరం నుంచి అనగా 2025-26 విద్యా సంవత్సరం నాటికి 100 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలనే నిర్ణయానికి కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పోయిన సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 250 పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించగా ఈ విద్యా సంవత్సరంలో మరో 210 పాఠశాలలకు విస్తరించారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పూర్వ ప్రాథమిక పాఠశాలల సంఖ్య 460కి చేరుకుంది. వీటికి అదనంగా పీఎంశ్రీ కింద మరో 112 పాఠశాలలు కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు.ఈ నిర్ణయం వల్ల విద్యార్థుల బాల్యదశ విద్యకు బలమైన పునాదులు పడతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పాఠశాలల వల్ల ప్రస్తుతం రాష్ట్రంలో పూర్వ ప్రాథమిక, ప్రాథమిక తరగతుల్లో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగిందంటున్నారు అధికారులు. అందుకే ప్రభుత్వం మరిన్ని పాఠశాలల్లో వీటిని ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతుంది.

# ఆహారంలో వెంట్రుకలు- ప్రయాణికుడికి రూ.35వేలు పరిహారం చెల్లించండి'- ఎయిర్ ఇండియాకు హైకోర్టు ఆదేశం!

ఆహారంలో వెంట్రుకలు వచ్చినందుకు మద్రాస్ హైకోర్టు ఎయిర్ ఇండియాకు చీవాట్లు పెట్టింది. ఇది పూర్తిగా విమానయాన సంస్థ నిర్లక్ష్యం వల్లనే జరిగిందని వ్యాఖ్యానించింది. బాధిత ప్రయాణికుడికి రూ.35,000 పరిహారం చెల్లించాలని ఆదేశించింది.

శ్రీలంక రాజధాని కొలంబో నుంచి చెన్నైకు సుందర పరిపూర్ణం అనే ప్రయాణికుడు వస్తున్నారు. ఆ సమయంలో ఆయనకు ఎయిర్ ఇండియా స్టాఫ్ భోజనం వడ్డించారు. ఆయన సగం భోజనం పూర్తి చేసిన తరువాత అందులో వెంట్రుకలు చూసి షాక్ అయ్యారు. వెంటనే ఆయన దీనిపై విమాన సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఆ తరువాత సదరు కలుషిత ఆహారం వల్ల ఆయన అనారోగ్యం పాలయ్యారు. దీనితో ఆయన తనకు ఇవ్వబడిన కలుషితి ఆహారం గురించి చెన్నై విమానాశ్రయ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనితో సుందర పరిపూర్ణం చెన్నై అదనపు సివిల్ కోర్టులో కేసు దాఖలు చేశారు. దీనితో న్యాయస్థానం బాధిత ప్రయాణికుడికి రూ.1 లక్ష చెల్లించాలని ఎయిర్ ఇండియాను ఆదేశించింది.

మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన ఎయిర్ ఇండియా అయితే చెన్నై అదనపు సివిల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఎయిర్ ఇండియా మద్రాస్ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. దీనిపై ఇవాళ (శుక్రవారం) జస్టిస్ బాలాజీ విచారణ జరిపారు. వాద, ప్రతివాదనల సందర్భంగా, సదరు ప్రయాణికుడికి వడ్డించిన ఆహారంలో వెంట్రుకలు ఉన్నట్లు ఎయిర్ ఇండియా అంగీకరించింది. అయితే ఇందులో తమ తప్పు ఏమీ లేదని పేర్కొంది."మా ఎయిర్ ఇండియా విమానంలో వడ్డించిన ఆహారం అపరిశుభ్రంగా ఉంది. అందుకు మేము విచారిస్తున్నాం. అయితే మా విమానంలో వడ్డించే ఆహారాన్ని చెన్నైలోని అంబాసిడర్ పల్లవ హోటల్ తయారు చేస్తుంది. కనుక ఆ హోటల్‌ను కూడా ఈ కేసులో చేర్చాలి. ఎందుకంటే అపరిశుభ్రమైన ఆహారానికి అదే బాధ్యత వహించాల్సి ఉంటుంది. కేవలం ఎయిర్ ఇండియా మాత్రమే దీనికి బాధ్యత వహించదు." అని ఎయిర్ ఇండియా తరఫు న్యాయవాదులు వాదించారు.

అయితే ఎయిర్ ఇండియా వాదనలను మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బాలాజీ తిరస్కరించారు. ఎయిర్ ఇండియా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తప్పును హోటల్‌పై నెట్టడానికి ప్రయత్నించిందని అన్నారు. అందుకే బాధిత ప్రయాణికుడికి పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. అయితే కింది కోర్టు విధించిన రూ.1 లక్ష రూపాయల పరిహారాన్ని తగ్గించి, రూ.35వేలు చెల్లించాలని ఆదేశించారు.

ఎయిర్ ఇండియాకు సంబంధించి, ఆహారంలో వెంట్రుకలు రావడం ఇదే మొదటిసారి కాదు. 2016 సెప్టెంబర్‌లో ముంబయి-న్యూయార్క్ విమానంలో వెళ్తున్న ప్రయాణికురాలికి పాసిపోయిన ఆహారాన్ని వడ్డించారు. పైగా దానిలో వెంట్రుకలు కూడా కనిపించాయి. దీనితో ఆమె జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ)కి ఫిర్యాదు చేసింది. దీనితో కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. '

## భారతదేశ పురోగతికి నదులే రహదారులు

తక్కువ కాలుష్యం, చౌకైన రవాణా వంటి ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. జలమార్గాల ద్వారా సరకు రవాణాలో అద్భుతమైన పురోగతి కనిపిస్తోందని గణాంకాలతో సహా వివరించారు. 2013-14లో కేవలం 18 మిలియన్ టన్నులుగా ఉన్న సరకు రవాణా, 2024-25 నాటికి 145 మిలియన్ టన్నులకు పెరిగిందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2030 నాటికి 200 మిలియన్ టన్నులు, 2047 నాటికి 250 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని తెలిపారు. అదే సమయంలో నదీ పర్యాటకం (రివర్ టూరిజం) కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని సోనోవాల్ అన్నారు. దశాబ్దం క్రితం కేవలం 5 క్రూయిజ్ నౌకలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 13 జలమార్గాల్లో 25 క్రూయిజ్ నౌకలు సేవలందిస్తున్నాయని చెప్పారు. గంగా, బ్రహ్మపుత్ర, కేరళ బ్యాక్‌వాటర్స్ ఈ రంగంలో ముందున్నాయని, వారణాసి, కోల్‌కతా, పాట్నా, గౌహతి వంటి టెర్మినళ్లను ఆధునికీకరిస్తున్నామని ఆయన తన వ్యాసంలో పేర్కొన్నారు.

## వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి భారీ ఊరట

అమరావతి ఏపీలో వైసీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డికి ఊరట లభించింది. మద్యం స్కాంలో నిందితుడిగా ఉంటూ ప్రస్తుతం బెయిల్ పై ఉన్న ఆయన చేసిన ఓ కీలక విజ్ఞప్తికి విజయవాడ ఏసీబీ కోర్టు అంగీకరించింది. అయితే కొన్ని షరతులు పెట్టింది. సీఐడీ వ్యతిరేకించినా మిథున్ రెడ్డి పిటిషన్ పై విచారణ జరిపిన ఏసీబీ కోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో వైసీపీ ఎంపీ ఊపిరిపీల్చుకున్నారు. ఈ నెల 23 నుంచి నవంబర్ 4 వరకూ విదేశీ పర్యటనకు వెళ్లేందుకు అనుమతి కావాలంటూ వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి విజయవాడ ఏసీబీ కోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. అయితే మద్యం కేసులో నిందితుడిగా ఉన్న ఆయనకు గతంలో ఇచ్చిన బెయిల్ పైనే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న సీఐడీ సిట్ విభాగం ఈ విజ్ఞప్తినీ ఒప్పుకోలేదు. అయితే కోర్టు మాత్రం మిథున్ రెడ్డి చేసిన వాదనతో ఏకీభవిస్తూ షరతులతో అనుమతి ఇచ్చింది.

మిథున్ రెడ్డి విదేశీ పర్యటనకు అనుమతించిన ఏసీబీ కోర్టు కొన్ని షరతులు పెట్టింది ఇందులో రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అలాగే విదేశీ పర్యటన తర్వాత తన పాస్‌పోర్టు కోర్టుకు అప్పగించాలని మిథున్‌రెడ్డిని ఆదేశించింది. దీంతో పాటు విదేశాల్లో ఎక్కడికి వెళ్తారో, ఎక్కడ ఉంటారో వివరాలు ఇవ్వాలని కూడా కోరింది. ఏపీ మద్యం కేసులో ఏ4గా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఈ షరతులకు అంగీరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసి అనుమతి తీసుకోనున్నారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో మిథున్ రెడ్డి పాత్రపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఆయన సుప్రీంకోర్టు వరకూ వెళ్లినా అరెస్టు నుంచి తప్పించుకోలేకపోయారు. దీంతో ఆయన గతంలో కోర్టు ఆదేశాల మేరకు లొంగిపోవడంతో రాజమండ్రి జైలుకు రిమాండ్ పై పంపారు. అక్కడ కొంతకాలం ఉన్నాక బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవడంతో ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత ఆయనకు రెగ్యులర్ బెయిల్ కూడా లభించింది.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

హైదరాబాద్ తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు నేడు (అక్టోబర్ 18) రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ బంద్‌కు ప్రధాన రాజకీయ పార్టీలన్నీ మద్దతు ప్రకటించాయి. అయితే తెలంగాణ బంద్ నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. నేడు వివిధ పార్టీలు తలపెట్టిన బంద్ కార్యక్రమాన్ని శాంతియుతంగా జరుపుకోవాలని స్పష్టం చేశారు. బంద్ పేరుతో అవాంఛనీయ సంఘటనలకు గానీ, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు గానీ పాల్పడినట్లయితే చట్టం ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నేడు చేపడుతున్న బంద్‌కు సంబంధించిన పరిస్థితులను పోలీస్ సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సాధారణ ప్రజలకు సమస్యలు ఎదురవకుండా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీజీపీ స్పష్టం చేశారు.

## ఖరీఫ్ రైతులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

అమరావతి ఏపీలో ఖరీఫ్ రైతులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈ సీజన్ లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక ప్రకటన చేశారు. ఈ నెల 27 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని తెరుస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అప్పటి నుంచే కొనుగోళ్లు ప్రారంభం అవుతాయన్నారు. ఈసారి ఖరీఫ్ సీజన్ లో 51 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వెల్లడించారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధేశించిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న ఆయన ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్న అందర్నీ కలుపుకొని పనిచేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేసిన 1674 కోట్ల రూపాయల బకాయిలను తీర్చడంలోనూ, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మిల్లర్లకు చెల్లించవలసిన 763 కోట్ల రూపాయలు చెల్లించడం ద్వారా కూటమి ప్రభుత్వం చాలా పారదర్శకంగా పనిచేస్తుందన్నారు. బ్యాంక్ గ్యారంటీలు 1:2 ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు గాను 35 బ్యాంకు సేవలను ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కొన్ని జిల్లాలలో రైస్ మిల్లుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని రియల్ టైం గవర్నెన్స్ చేసి చూపిస్తామన్నారు. సంస్కరణలలో భాగంగా వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్: "హాయ్" అని పంపగానే కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్ అరికట్టడంలో రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి తోడుగా నిలవాలని ఆయన కోరారు. రైతు కోసం కలిసి పనిచేద్దాం, వ్యవస్థను గౌరవిద్దామన్నారు. గత సంవత్సరం అనుభవంతో, తేమ శాతం కొలిచే యంత్రాలు, రవాణా సదుపాయాలు, క్వాలిటీ గన్నీ బ్యాగులు ముందుగానే సిద్ధం చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. సమస్య పరిష్కారానికి ఎప్పుడు సిద్ధంగా ఉండాలని, పని చేసే విధానం పారదర్శకంగా ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 3013 రైతు సేవా కేంద్రాలు, 2061 పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మొత్తం 10,700 సిబ్బందితో ధాన్యం సేకరణకు సిద్ధమవుతున్నట్టు మంత్రి తెలిపారు.

## హైదరాబాద్‌లోని పలు ఫారెక్స్ సంస్థల్లో ఈడీ తనిఖీలు

లేకుండా, బోగస్ పత్రాలతో ఈ సంస్థలు నిర్వహిస్తున్నట్లు సోదాల్లో తేలింది. కొన్ని ఫారెక్స్ సంస్థలు అక్రమంగా డబ్బు మార్పిడి వ్యాపారం చేస్తున్నట్లు ఈడీ దర్యాప్తులో వెల్లడైంది. పలు సంస్థలు ఫెమా నిబంధనలను ఉల్లంఘించినట్లు ఈడీ పేర్కొంది. ఈ దాడుల్లో నకిలీ పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లతో పాటు రూ. 11.99 లక్షల నగదు, రూ. 26.77 లక్షల విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

## తెరుచుకున్న శబరిమల అయ్యప్ప ఆలయం- ద్వారపాలక విగ్రహాలకు తిరిగి బంగారు తాపడం

### ఆలయ పూజారులు, అధికారుల సమక్షంలో ప్రతిష్ఠ

కేరళలోని శబరిమల అయ్యప్పస్వామి దేవాలయంలోని ద్వారపాలక విగ్రహాలపై పూత పూసిన బంగారు-రాగి తాపడాలను తిరిగి ప్రతిష్ఠించారు. తులం మాసం సందర్భంగా ఆలయాన్ని ప్రారంభించిన క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సుమారు 14 బంగారు-రాగి తాపడాలను కేరళ హైకోర్టు ఆదేశాల మేరకు తీసుకువచ్చినట్లు తెలిపారు. చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ నుంచి తిరిగి తీసుకువచ్చి ఆలయ పూజారులు, అధికారుల సమక్షంలో ప్రతిష్ఠించారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు గంట సమయం పట్టిందని అధికారులు తెలిపారు. బంగారు తాపడాలను రాతితో తయారైన విగ్రహాలపై మేకులతో బిగించినట్లు వివరించారు.

మరోవైపు తులం మాస పూజల కోసం శబరిమల అయ్యప్ప ఆలయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తెరిచారు. అక్టోబర్ 17- 22 వరకు ఐదు రోజుల పాటు తెరవనున్నట్లు ట్రావెన్ కోర్ దేవస్వమ్ బోర్డు (టీడీబీ) ప్రకటించింది. ఉదయాస్తమాన పూజ, పడిపూజ, కలశాభిషేకం, పుష్పాభిషేకం వంటి ఐదు రోజుల ప్రత్యేక ఆచారాల తర్వాత అక్టోబర్ 22న రాత్రి 10 గంటలకు మూసివేస్తామని వివరించింది. ఇప్పటికే దాదాపు 30,000 మంది భక్తులు అయ్యప్ప దర్శనానికి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అక్టోబర్ 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఆలయాన్ని సందర్శించనున్నారు.అంతకుముందు ఈ బంగారం చోరీ కేసులో ప్రధాన నిందితుడు బెంగళూరు వ్యాపార వేత్త ఉన్నికృష్ణన్ పొట్టిని కేరళ హైకోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్టు చేసింది. గురువారం తిరువనంతపురంలోని క్రైమ్‌బ్రాంచ్ ఆఫీసులో ఉన్నికృష్ణన్ పొట్టీని విచారించిన సిట్, శుక్రవారం పులిమత్‌లోని ఆయన నివాసం నుంచి కస్టడీలోకి తీసుకుంది. తర్వాత పొట్టీని ఆస్పత్రికి తరలించిన సిట్ అధికారులు వైద్యపరీక్షలు నిర్వహించారు.

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ గారి మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలి.

### తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన మరియు వినతి పత్రం.

ఏం ఆర్ పి ఎస్ వికారాబాద్ మండల ఇన్చార్జి శ్రీనివాస్.




సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా..వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయం ముందు ఎంఆర్ఎఫ్ పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.అక్టోబర్ 7 2025 రోజున భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి ఆర్ గవాయ్ గారు బెంచ్ మీద లాయర్ వాదనలు వింటున్న సమయంలో రాకేష్ కిషోర్ అనే వ్యక్తి షూస్ విసిరిన దాడికి పాల్పడ్డాడు చీఫ్ జస్టిస్ గారి మీద జరిగిన దాడి అనాగరికమైంది ఈ దాడి ఆ ప్రజాస్వామిక స్ఫూర్తి, రాజ్యాంగం, మీద జరిగిన దాడిగానే ఉన్నది ఈ దాడి సమస్త భారతీయులను దృక్బంతికి గురిచేసింది దళిత పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురిచేసింది అందువల్ల దేశ ప్రజలందరూ ఈ దాడిని ఖండించారు దళితుడైన బిఆర్ గవాయి గారు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కావడం కొని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయి.. అందుకే అహంకారపూరితంగా ఈ దాడికి తెగబడ్డారు కావున ఈ దాడికి పాల్పడ్డ వ్యక్తి మీద తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలి . అలాగే దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా ఈ ఘటన మీద సమగ్రమైన దర్యాప్తు జరిపించాలి అందుకోసం సుప్రీంకోర్టులో అనుభవం కలిగిన ప్రజా స్వామికి దృక్పథం కలిగిన రిటైర్డ్ జడ్జిలను దర్యాప్తు కోసం నియమించాలి. అలాగే ఇలాంటి ఘటనలో ఉన్నత న్యాయస్థానాల్లో పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి ఈ డిమాండ్లను తక్షణ పరిగణలోకి తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని తమరి ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కోరుతున్నాము మన డిమాండ్తో ఈరోజు స్థానిక వికారాబాద్ మండలం కేంద్రంలోని ఏం ఆర్ పి ఎస్ మరియు ఏం ఎస్ పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి ఆనంద్ మాదిగ, మాదిగ మహిళ సమాఖ్య జిల్లా నాయకురాలు పుష్పరాని, మాదిగ మహిళా సమాఖ్య నాయకురాలు కేశపల్లి సునీత రాములు, , రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆనందం, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి రాజు, ఏం ఆర్ పి ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జగన్, అయూబ్ చంద్రకళ యాదమ్మ వసంత, వికలాంగుల హక్కుల పోరాట సమితి., మండల అధ్యక్షులు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రజల ఆకాంక్షల దిశగా కాంగ్రెస్ చారిత్రాత్మక నిర్ణయం...

### స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం...

### కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపిన నాయకులు..







సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి కృతజ్ఞతగా,పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే %ఙ% డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే కలిసి కాంగ్రెస్ నాయకులు కేక్ కటింగ్ చేశారు.

వారు మాట్లాడుతూ %–% “ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధి దిశగా మరో ముందడుగు.సాధారణ కుటుంబాల అభ్యున్నతి కోసం తీసుకున్న ఈ నిర్ణయం గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది” అని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి నాయకులు,కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, “కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుంది. ప్రతి నిర్ణయం ప్రజల భవిష్యత్తు దృష్ట్యా తీసుకుంటుంది” అన్నారు..

# బీసీ ల కు రిజర్వేషన్ లు కల్పించాలని సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా నాయకులు వికారాబాద్ లో నిరసన ధర్నా

### సిపిఎం కార్యదర్శి ఆర్. మహిపాల్ సిపిఐ జిల్లా కార్యదర్శి గోపాల్ రెడ్డి...

సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..




బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాటకమాడుతున్నదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ విమర్శించారు. ఒకవైపు కేంద్రంలో బీసీ రిజర్వేషన్ల బిల్లును, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటూ ఇంకోవైపు రాష్ట్రంలో ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు బీజేపీ మద్దతు ఇచ్చిందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా పోరాడితేనే ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్రబంద్‌లో పాల్గంటామనీ, లేదంటే స్వతంత్రంగా ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలో బీసీ సంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజాతంత్రవాదులు భాగస్వాములు కావాలని కోరారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శుక్రవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసిందన్నారు. అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదించి బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించిందని వివరించారు. ఆర్నెల్లైనా ఆమోదించలేదని చెప్పారు. రాష్ట్ర మంత్రివర్గం ఆర్డినెన్స్‌ను ఆమోదించి గవర్నర్‌కు పంపిస్తే దాన్ని కూడా కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి జీవో నెంబర్ తొమ్మిదిని విడుదల చేసిందన్నారు. ఆ జీవోపై హైకోర్టు స్టే విధించిందని చెప్పారు. ఆ స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే ఆ పిటిషన్‌ను తిరస్కరించిందని వివరించారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించుకోవాలంటూ సూచించిందని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. ఈనెల 18న బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిందనీ, అన్ని రాజకీయ పార్టీల మద్దతునూ కోరిందని చెప్పారు. ఈ బంద్‌కు బీజేపీ కూడా మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందనీ, బీసీ రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత ఆ పార్టీపైనే ఉందని అన్నారులి. కాంగ్రెస్ కూడా బంద్‌కు మద్దతు ఇచ్చిందన్నారు. ఇప్పుడు రాష్ట్రబంద్ ఎవరికి వ్యతిరేకంగా జరుగుతున్నదని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలున్నారని వివరించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వాన్ని బీజేపీ ప్రజాప్రతినిధులు అడుగుతారా?అని ప్రశ్నించారు. బీసీ జేఏసీ నేతలు ఆలోచించాలనీ, కేంద్రం తీరుకు వ్యతిరేకంగా బంద్ నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం నిర్వహించాలనీ, కేంద్రంపై పోరాడాలని సూచించారు. అప్పుడే రాష్ట్ర ప్రభుత్వానికి ఈ అంశంలో సీపీఐ(ఎం) మద్దతునిస్తుందని చెప్పారు. బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వడంతో ప్రజలకు సరైన దిశ ఉండబోదని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కోరుతూ కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు శుక్రవారం చలో రాజ్‌భవన్. ఈనెల 18న బీజేపీకి వ్యతిరేకంగా బంద్ చేపడితే పాల్గంటామనీ, లేదంటే అదేరోజు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మండలాలు, పట్టణాల్లో ప్రదర్శనలు, ధర్నాలు, బ్కెక్ యాత్రలు నిర్వహిస్తామనీ, కేంద్రం తీరును నిరసిస్తామని అన్నారు. ఇందులో బీసీ సంఘాలు, అభ్యుదయ సంఘాలు, ప్రజాతంత్రవాదులు పాల్గనాలని కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రం అడ్డుకునే రాజకీయ పార్టీని అందరూ గుర్తించాలని సీపీఐ(ఎం) అన్నారు. ఈ రిజర్వేషన్లకు ప్రధాన అవరోధం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. ఆ పార్టీకి, ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్ జరగాలన్నారు. బీజేపీ ఉన్న వేదికల్లో తాము పాల్గనేది లేదని స్పష్టం చేశారు. తాము స్వతంత్రంగా ఉద్యమాలను చేపడతామని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంపై పోరాడాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అఖిలపక్షం సహకారంతో డీల్లీ కేంద్రంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్,సిపిఐ జిల్లా కార్యదర్శి గోపాల్ రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుదర్శన్ సతీష్ నవీన్, నాయకులు కార్యకర్తలు లక్ష్మయ్య రాహుల్ దశరథ్ మహేందర్ యాదగిరి బుచన్న కిషన్ అరుణ్ సిపిఎం సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి.

### మహిళలు, బాలికలకు భద్రత కల్పించడమే అత్యంత ప్రాధాన్యత.

### వారాంతపు రోజులలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

### ఇ-పెట్టి కేసులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు

### కేసులలో కన్విక్షన్ రావడానికి సహకరించిన అధికారులను సన్మానించిన ఎస్పీ

### నేర నియంత్రణలో సీసీటీవీలే కీలకం.

### జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి







సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా : బాలికలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు.వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి శుక్రవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ సమీక్షలో ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ఎస్పీ దృష్టి సారించారు. పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, విచారణను వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా, జారీ అయిన నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచి వారిని నియంత్రించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలకు గల కారణాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్న హాట్‌స్పాట్‌లలో నివారణ చర్యలు తీసుకోవాలని, ప్రజలలో అవగాహన కల్పించడానికి కళాజాత బృందాల ద్వారా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ముఖ్యంగా మహిళలు మరియు బాలికలపై జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అటువంటి అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ఎటువంటి జాప్యం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారి నేర చరిత్రను పూర్తిగా పరిశీలించి రౌడీ షీట్‌లు తెరవాలని, మరియు పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడానికి రికార్డులను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమాజంలో మహిళలు, బాలికలకు పూర్తి భద్రత కల్పించడం పోలీసుల ప్రాథమిక బాధ్యత అని ఆయన తెలిపినారు . ప్రతి ఒక్కరూ డ్రగ్స్ నిర్మూలన కొరకు కష్టపడి పని చేయాలని తెలిపారు.నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర చాలా కీలకమని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపినారు. ప్రజలలో సీసీటీవీల ఏర్పాటుపై అవగాహన కల్పించాలని, వాటి ప్రాముఖ్యతను వివరించాలని కోరారు. ఇసుక అక్రమ రవాణా, గుట్కా విక్రయాలు, మరియు పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారాంతపు రోజుల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ఓపెన్ డ్రింకింగ్ నివారణ, మరియు వాహనాల తనిఖీలను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఇ-పెట్టీ కేసులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్‌ను సమర్థవంతంగా వినియోగించుకొని కేసుల కన్విక్షన్ శాతాన్ని పెంచాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఇట్టి కార్యక్రమం అనంతరం జిల్లా ఎస్పీ ఇటీవల కేసులలో కన్విక్షన్ రావడానికి సహకరించిన కోడంగల్ కోర్ట్ ఏపీపిఓ అధికారి వి.అభినై, వికారాబాద్ ఏజెఎఫ్ సీఎం కోర్ట్ అధికారిని ఏపీపీ సమీనా బేగం, పోలీస్ అధికారులు ఉమెన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సరోజా, కోడంగల్, పిఎస్, ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ, నవాబ్ పేట్ పిఎస్ ఎస్‌హెచ్‌ఓ పున్లిక్ ,కోర్ట్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ మరియి కోర్ట్ కానిస్టేబుల్ అధికారులకు శాలువాతో సత్కరించి, మేమంటోలు అందించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్ , వికారాబాద్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి,తాండూర్ డిఎస్పి బాల కృష్ణ రెడ్డి పరిగి డిఎస్పి శ్రీనివాస్,డీటీసీ డీస్పీ శ్రీనివాసులు అధికారులు, డి సి ఆర్ బి డీస్పీ జానయ్య వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్ సీఐ బి.సరోజ , ఇన్స్పెక్టర్లు, మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యమేవ జయతే



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని రేపటి బందును విజయవంతం చేయండి. సిపిఐ (ఎమ్ ఎల్ )న్యూడెమోక్రసీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి వై మహేందర్ .



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి అన్నిఈ సందర్భంగా సిపిఐ (ఎమ్ ఎల్ )న్యూడెమోక్రసీ వికారాబాద్ జిల్లా కార్యదర్శి వై మహేందర్ మాట్లాడుతు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 9 ని హైకోర్టు కొట్టి వేసింది ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని బీసీ జేఏసీ రాజ్యాంగం లోని 9వ షెడ్యూల్లో ఈ రిజర్వేషన్ల చేర్చడం ద్వారా దీని సాకారం చేయాలనే డిమాండ్ తో రేపు రాష్ట్ర బంద్ కు పిలుపునివ్వడం జరిగింది. న్యాయమైన ఈ బందులో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పిలుపునివ్వడం జరిగింది.

రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన ఇటు రాష్ట్ర గవర్నర్ కానీ అటు కేంద్ర ప్రభుత్వం కానీ పట్టించుకోకపోవడం వల్ల నోటికాడి ముద్దను లాగేసుకున్నట్లుగా బీసీ ప్రజానీకం పరిస్థితి ఉన్నది కావున కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మరియు రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సమన్వయంతో ఈ రిజర్వేషన్ల అమలు కోసం కృషి చేయాల్సిన అవసరం ఉన్నది. బీసీల యొక్క న్యాయమైన డిమాండ్ 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం రేపు తలపెట్టిన రాష్ట్ర బంద్ను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ప్రజా సంఘాలు కుల సంఘాల నాయకులు ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు.



సత్యమేవ జయతే/హత్నూర: మండలంలోని పశువైద్యాధికారిణి డాక్టర్ సంధ్యారాణి, హేమలత ఆధ్వర్యంలో శుక్రవారం దౌలాపూర్, సికింద్లపూర్, కోనంపేట గ్రామాల్లో ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సహాయ పశు వైద్య సంచాలకులు డాక్టర్ ఆదిత్య వర్మ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు టీకాలు వెయ్యాలని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. 4 నెలలు పైబడిన ప్రతి పశువుకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది జేవివో భాగ్యలక్ష్మి, ఎల్ఎస్ఏ రాజు, సంగమేశ్వర్, సుధాకర్, రాజిరెడ్డి, నాగేష్, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు..

## మాదారం గ్రామంలో ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవ వేడుకలు.



సత్యమేవ జయతే హత్నూర మండలం మాదారం గ్రామంలో యక్షి స్వచంద సంస్థ మరియు సత్య శోధక సంఘం,ఆహార సార్వభౌమత్వ వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని గ్రామంలో ఉన్న అన్ని కులాల ప్రజల సహకారంతో అందరూ కలిసి ఒక దగ్గర కార్యక్రమాన్ని చేసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఆహార దినోత్సవం యొక్క ఉద్దేశాన్ని,ప్రాముఖ్యత గురించి అందరికీ తెలియచేస్తూ ప్రస్తుతం మనం అందరం రసాయనాలు పురుగు మందులు,వాడిన విషపూరితమైన తిండిని తింటున్నాము. అనేక రకాల రోగాలకు,కాన్సర్ వలన ఆసుపత్రి పాలవుతున్నాము. ప్రపంచంలో ఆకలితో ఎవరు ఉండకూడదు,రసాయన మందులు,గడ్డిమందులు తగ్గించి మంచి పౌష్టికాహారం పండించుకొని తినే ప్రకృతిని మనం మళ్ళీ తెచ్చుకోవాలి అని తీర్మానించుకోవటం జరిగింది.ఇలాగే మాదారం గ్రామం ప్రజలందరూ కుల,మత తేడాలు చూపించుకోకుండా ఐక్యతతో కలిసి మెలిసి హథ్నూర మండలంలో ఒక ఆదర్శ గ్రామంగా నిలవాలి అని మాట్లాడుకోవటం జరిగింది..ఇందులో భాగంగా అప్పట్లో తినే తిండి వంటలు గుమ్మడి కూర,తంగేడు పువ్వు కూర, పొనగంటి కూర,గునాగ ఆకు కూర, గౌర్మటి ఆకు కూర, దొగ్గలి కూర,కొర్ర పాశం,ఎర్ర బియ్యం,చిట్టిముత్యాలు బియ్యం,పప్పు,వంకాయ ఆలుగడ్డ కూర వంటలు వండుకొని అందరం కలిసి ఒకచోట కూర్చొని తినటం జరిగింది.ఈ కార్యక్రమంలో మాదారం గ్రామస్తులు, సత్య శోధక సంఘం సభ్యులు నీరజ,శ్రావణి,నవీన్,నాగార్జున్ యక్షి సంస్థ సభ్యులు తదితరులు పాల్గొనటం జరిగింది.

# బి వి ఆర్ ఐ టి లో ప్రారంభమైన అస్త్ర 2025 జాతీయ స్థాయి పోటీలు












సత్యమేవ జయతే/నర్సాపూర్మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణ సమీపంలోని బి వి ఆర్ ఐ టి ఇంజనీరింగ్ కళాశాలలో శు క్రవారం అస్త్ర 2025 జాతీయస్థాయి ప్రతిభ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ సంజయ్ దుబే తెలిపారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని అన్నారు. రియాక్షన్ కార్ పోటీలు తొలిసారి తెలంగాణలో జరుగుతున్నాయన్నారు. ఉత్క్రాష్టమైన ఆవిష్కరణ అద్భుతమైన ఇంజనీరింగ్ ప్రతిభ ప్రదర్శించేందుకు బి వి ఆర్ ఐ టి కెమికల్ ఇంజనీరింగ్ వేదిక కావందన్నారు. ఈ పోటీలు ఈనెల 17, 18 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. దేశంలోని ప్రముఖ విద్యాలయాల, విద్యార్థులు వారి వారి సృజనాత్మకత సాంకేతిక ఇంజనీరింగ్ ప్రతిభ జట్టు సమిష్టి కృషి ప్రదర్శించేందుకు ఎంతో దోహద పడుతాయన్నారు .ఈ పోటీలలో ప్రధాన ఆకర్షణ రెక్ట్ ,ఒ ,కార్ ఇందులో జట్టు రసాయన ఎలక్ట్రో కెమికల్ ప్రతిస్పాదనతో నడిచే మోడల్ కార్లు రూపొందించడానికి సవాలు ఉంటుందన్నారు. టెక్ ఓ కార్ ఇందులో ఎలక్ట్రానిక్స్ మెకానికల్, ఇంటిగ్రేషన్ మీద ఆధారపడి ఆవిష్కరణత్మక మోడల్ కార్లను రూపొందించే డిజైన్, ఛాలెంజ్ ఇది ఒక సృజనాత్మక మోడల్ తయారీ పోటీ అన్నారు. పోటీదారులు తమ ఇంజనీరింగ్ నైపుణ్యాలు ఉపయోగించి సమస్యల పరిష్కారం మోడల్స్ ప్రదర్శిస్తారని తెలిపారు. ఇందులో పజిల్స్, క్విజెస్ సృజనాత్మక పోటీలు ఉంటాయన్నారు .అనంతరం డైరెక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఈ పోటీలు బి వి ఆర్ ఐ టీ లో నిర్వహించాలన్నది విష్ణు విద్యా సంస్థల చైర్మన్ విష్ణు రాజు కల అన్నారు. రెండు సంవత్సరాలుగా కష్టపడి ప్రణాళికతో అధ్యాపకులు,, విద్యార్థు లు ఈ పోటీని నిర్వహించేందుకు ముందుకు రావడం పట్ల అభినందనీయమన్నారు. ఈ పోటీల కు స్పాన్సర్స్ గా గ్రాన్యూల్స్ ఇండియా, అపిటోరియా ఫార్మా, వసంత్ కెమికల్స్, నకోడా కెమికల్స్, ప్రోటీక్ ఇంజనీరింగ్, ఊరా కెమికల్స్, ఐటీసీ ఫుడ్స్ , సాల్వో సాల్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ బాపిరాజు, ఏఓ సురేష్ ,కళాశాల వివిధ విభాగాతిపతులు, ఫ్యాకల్టీ మెంబర్స్, డిపార్ట్మెంట్ అధ్యాపకులు, డిన్స్ హెచ్ ఓ డి లు విద్యార్థులు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి నిరసనగా తహసీల్దార్ కు వినతి.



సత్యమేవ జయతే/హత్నూర: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయిపై జరిగిన దాడిని నిరసనగా హత్నూర తాహసిల్దార్ ఫర్వీన్ షేక్ కు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం శు క్రవారం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై జరిగిన దాడి రాజ్యాంగ విరుద్ధమని,ఈ దాడి న్యాయవ్యవస్థపై జరిగినదని అభివర్ణిస్తూ తీవ్రంగా ఖండించారు.దాడికి పాల్పడిన కుట్ర దారుల్ని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి దాడులు పునారావృత్తం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్వాది పార్టీ జిల్లా నాయకులు పవన్ కుమార్, ఎమ్మార్పీఎస్ నాయకులు సాయిలు, మల్లేశం, రాములు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు

## విద్యా సంస్థలకు రామగుండం బల్దియా హెచ్చరిక

సత్యమేవ జయతే - పెద్దపల్లి పెద్దపల్లి : రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని విద్యా సంస్థలకు నగర పాలక సంస్థ హెచ్చరిక జారీ చేసింది. నగర పాలక పరిధిలో గల అన్ని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులకు షరతులను విధించింది. విద్యా సంస్థలు నడపడానికి కావల్సిన నిరభ్యంతర ధృవీకరణ పత్రం (ఎన్ ఓ సీ) తోపాటు పారిశుధ్య ధృవీకరణ పత్రం తప్పనిసరిగా కలిగి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్ జే.అరుణ శ్రీ శుక్రవారం నోటీసులు జారీ చేశారు.

ఈ విద్యా సంవత్సరంనకు సంబంధించి ధృవీకరణ పత్రాలు పొందని విద్యా సంస్థల నిర్వాహకులు నిర్ణీత దరఖాస్తు ఫారం పూరించి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి ఒక్కో ధృవీకరణ పత్రంకు రూ.10 వేలు రుసుం చొప్పున చెల్లించి నగర పాలక సంస్థ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.




ఆ పిదప క్షేత్ర స్థాయిలో పరిశీలించాక సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుందన్నారు. నగర పాలక సంస్థ అధికారులు తనిఖీలు నిర్వహించిన సమయంలో చెల్లుబాటులో ఉన్న ఎన్ఓసీ, శానిటేషన్ సర్టిఫికెట్ చూపించకపోతే జరిమానా విధించడంతో పాటు సదరు విద్యా సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు సకాలంలో ధృవీకరణ పత్రాలు పొంది నగర పాలక సంస్థకు సహకరించాలని ఆమె కోరారు.

## పేదరిక నిర్మూలనకు చదివే సరైన మార్గం : జడ్జి కీర్తి చంద్రిక రెడ్డి

సత్యమేవ జయతే - ఇల్లందు

ఇల్లందు : పేదరిక నిర్మూలనకు చదివే సరైన మార్గమని ఇల్లెందు కోర్టు జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. శుక్రవారం ఇల్లెందు మున్సిపాలిటీ కార్యాలయం పక్కన ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాలలో అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థి దశ నుండి ప్రతి ఒక్కరూ కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చున్నారు. అలాగే బాలికలు సొంతంగా వారి కాళ్ల మీద వాళ్ల నిలబడేలా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ




కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంపల్లి ఉమామహేశ్వర రావు, న్యాయవాది పిరమిడ వెంకటేశ్వర్లు, వార్డెన్ సునీత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## జెడ్ పి హెచ్ ఎస్ సిరిపురం స్కూల్లో సౌచాలయ పునర్నిర్మాణం

లయన్స్ క్లబ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఆందోల్ పోచయ్య గారు స్కూల్లో సౌచాలయం కొరతా ఉండటం వల్ల విద్యార్థుల పాట్లను చూడలేక సౌచాలయ్య పునర్నిర్మాణ కార్యక్రమం చేయడం జరిగిందిఇట్టి నిర్మాణానికి గాను అక్షరాల ఒక్క లక్ష రూపాయలు పెట్టడం జరిగింది అదేవిధంగా మానసిక నైపుణ్య నిపుణులు విజయ్ జాకోజి సర్ మరియు రాజేశ్వర్ సార్ పిల్లలకు ప్రేరణాత్మక రాతపూర్వక నైపుణ్యంలో మెలకువలు నేర్పించడం జరిగింది

## బీసీ బంద్‌కు కాంగ్రెస్ పూర్తి మద్దతు ప్రకటించిన నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి.



సత్యమేవ జయతే న్యూస్/ నర్సాపూర్నర్సాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఈ నెల 18న బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి. తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ %-% బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించడానికి, వారికి న్యాయం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. బీసీ జేఏసీ చేపడుతున్న ఉద్యమం సమాజ హక్కుల సాధన దిశగా ముందడుగని పేర్కొన్నారు.
బీసీలకు తగిన గౌరవం, ప్రాధాన్యం రావాలంటే అందరం ఒక్కటై బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఆవుల రాజిరెడ్డి.నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీనర్సాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఈ నెల 18న బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి. తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ %-% బీసీలకు రాజ్యాంగబద్ధ హక్కులు కల్పించడానికి, వారికి న్యాయం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. బీసీ జేఏసీ చేపడుతున్న ఉద్యమం సమాజ హక్కుల సాధన దిశగా ముందడుగని పేర్కొన్నారు.బీసీలకు తగిన గౌరవం, ప్రాధాన్యం రావాలంటే అందరం ఒక్కటై బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## అయ్యప్ప దేవాలయ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి.



సత్యమేవ జయతే న్యూస్/ నర్సాపూర్ ప్రతినిధి:- నర్సాపూర్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గారు అక్కడ జరుగుతున్న పనులను మండపం హాల్ అన్ని మందిరాలను పరిశీలించి ఇది నర్సాపూర్ నియోజకవర్గానికి ఒక ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెదజల్లుతోందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ దుర్గాప్ప గారి అశోక్ గౌడ్ గారు మాజీ కాప్షన్ మెంబర్ మన్సూర్ మండల పార్టీ అధ్యక్షుడు భోగా శేఖర్ వెల్దుర్తి మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్ నాయకులు కార్యకర్తలు గురు స్వాములు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సబ్బండ వర్గాలు బంద్ లో పాల్గొనాలి బీసీల 42% రిజర్వేషన్ల అమలుకై బందును విజయవంతం చేద్దాం బీసీ సంఘాలకు మద్దతుగా సబ్బండ వర్గాలు



కుత్బుల్లాపూర్,అక్టోబర్ 17, సత్యమేవ జయతే ప్రతినిధి :-సమాజంలో సగ భాగంగా ఉన్న బీసీలు 42% రిజర్వేషన్ల అమలుకు నోచుకోలేక ఎన్నో రకాలుగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారికి జరుగుతున్నఅన్యాయం పై పోరాటమే రేపటి బంద్ అని, దీనిలో అన్ని వర్గాల ప్రజల స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహుజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.పార్టీలకు అతీతంగా జరుగుతున్న బంద్ సంపూర్ణంగా విజయవంతం అయ్యేటట్లు చూడాలని కోరారు. దామాషా ప్రకారం న్యాయంగా దక్కాల్సిన వాటా కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. 42 శాతం రీసర్వేషన్ వచ్చే వరకు ఎన్నికలు నిర్వహించవద్దని డిమాండ్ చేశారు.

# కొడుకు అదృశ్యం...తల్లి కన్నీటి పర్యంతం



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17, సత్యమేవ జయతే ప్రతినిధి



మతిస్థిమితం సరిగా లేని ఓ యువకుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పదిహేను రోజులుగా కుమారుడు కనిపించకపోవడంతో వృద్ధురాలైన తల్లి కుమారుడి ఫోటో పట్టుకుని రోడ్లపై తిరిగుతూ కనిపించిన వారినల్లా తన కొడుకు ఎక్కడైనా కనిపించాడా అంటూ కన్నీటి పర్యంతమవుతుంది. వివరాల్లోకి వెళితే.. జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్ బి బ్లాక్ ప్రాంతానికి చెందిన పద్మ కుమారుడు పల్లెపు నగేష్(25) ఇంటి వద్దనే ఉంటున్నాడు. నగేష్‌కు గత కొంత కాలంగా మానసిక స్థితి సరిగ్గా లేదు. కాగా పద్మ తన కుమారుడితో కలిసి ఈ నెల 1వ తేదిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాయలసీమలోని మల్లెల గ్రామంలోని కూతురు ఇంటికి వెళ్లింది. ఈ నెల 3వ తేదిన నగేష్ తిరిగి ఇంటికి రాగా 4వ తేదిన పద్మ ఇంటికి వచ్చింది. ఇంట్లో నగేష్ కనిపించకపోవడంతో చుట్టు ప్రక్కల వాకబు చేయగా అదే రోజు ఉదయం తన ద్విచక్ర వాహనాన్ని తీసుకుని బయటకు వెళ్లాడని తెలిపారు. దీంతో పద్మ జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తన కొడుకు ఆచూకీ కనిపెట్టి తనకు అప్పగించాలని పద్మ

# పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం.. కరీంనగర్ కలెక్టర్ పమేల సత్పతి



సత్యమేవ జయతే - కరీంనగర్
కరీంనగర్ : పౌష్టికాహారం తీసుకోవడం వల్లనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం గంగాధర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్వహించిన సభ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి

సత్యంతో కలిసి హాజరైనారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతం, చిన్నారులకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించగా గర్భిణులకు సారె, పసుపు, కుంకుమ, పౌష్టికాహారాన్ని అందజేశారు. చిన్నారులకు పౌష్టికాహారంతో అన్నప్రాసన చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలలోని మహిళల ఆరోగ్యం కోసం అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం సభా కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పోషకాహార లోపం ఉన్న మహిళలు, చిన్నారులను గుర్తించి వారికి మాతా శిశు సంరక్షణ ద్వారా ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శుక్రవారం సభ కార్యక్రమం ద్వారా పోషకాహార లోపంపై గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మహిళలే కేంద్రంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇల్లు ఇలా ఏ పథకం తీసుకున్న మహిళలే ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాసిల్దార్ రజిత, ఎంపీడీవో రాము, సిడిపిఓ నర్సింగరాణి, ఎంఈఓ ప్రభాకర్ రావు, అంగన్వాడి సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# 'విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల పాత్ర కీలకం'

సత్యమేవ జయతే - హనుమకొండ
హనుమకొండ : విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల పాత్ర కీలకమని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ సెనేట్‌హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ జ్ఞానవ్యవస్థ ఏకీకరణలో ఎన్ఎస్ఎస్ అధికారుల పాత్ర ప్రాముఖ్యత సంతరించుకుందని, కొత్త విద్యా విధానం(ఎన్ఈపీ) అదే దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. విద్యార్థులు పాఠ్యేతర కార్యక్రమాలపై దృష్టి సారించి, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నైతిక విలువలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. నూతన ప్రోగ్రాం ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి మాట్లాడుతూ విద్యార్థులను దేశభవిష్యత్ నిర్మాణదిశగా తీసుకువెళ్లడంలో




ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల పాత్ర కీలకమన్నారు. గ్రామీణ సమస్యలపై అధ్యయనం జరగాలని, త్యాగధనుల స్ఫూర్తిని కొనసాగించాలని, దేశసేవకు సిద్ధమైన యువతను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మై భారత్ పోర్టల్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్, ప్రొఫెసర్ ఈసం నారాయణ, అధ్యాపకులు టి.రాధిక, రాంబాబు, జంబు, అనిల్, ప్రసన్నకుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

## ఏసీబీ దాడులు.. లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డ మత్స్య, అటవీశాఖ అధికారులు





సత్యమేవ జయతే - వరంగల్/ వికరాబాద్వరంగల్/ వికరాబాద్ అవినీతి అధికారులు రోజుకో జిల్లాలో పట్టుబడుతున్నారు. వరంగల్, వికరాబాద్ జిల్లాలో ఒకేరోజు నలుగురు అధికారులు ఏసీబీ అధికారులకు శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వరంగల్ జిల్లా మత్స్యశాఖ అధికారి అల్లు నాగమణి రూ.70 వేలు తీసుకుంటుండగా అవినీతి నిరోధక అధికారులు పట్టుకున్నారు.:
మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో 84 మంది కొత్త సభ్యుల సభ్యత్వం కోసం లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితులు అధికారులను ఆశ్రయించగా నాగమణితో పాటు ఫీల్డ్ ఆఫీసర్ పెద్దబోయిన హరీష్‌ను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకుని వరంగల్ ఏసీబీలో కోర్టులో ప్రవేశపెట్టారు.
- వికరాబాద్ జిల్లాలో
అదేవిధంగా వికరాబాద్ జిల్లా పరిగి అటవీ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న ఫారెస్టు సెక్షన్ అధికారులు బొల్లుమల్ల సాయికుమార్, మహ్మద్ మొయినొద్దీన్, డ్రైవర్ బాలనగరం బాలకృష్ణ రూ. 30 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. అటవీ నుంచి సీతాఫలాల రవాణా అనుమతి కోసం బాధితుడు సంప్రదించగా అధికారులు డబ్బులు డిమాండ్ చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు శుక్రవారం లంచం తీసుకుంటుండగా ముగ్గురిని పట్టుకుని కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టామని అధికారులు తెలిపారు.

## కొడంగల్ లో "సంఘటన సృజన్ అభియాన్" కార్యక్రమం.. డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తుల స్వీకరణ...



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా... కొండగల్ పట్టణంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు,టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సూచనలతో డిసిసి అధ్యక్షులు %డ% పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో,కొడంగల్ పట్టణం లోని మంజునాథ్ బంక్యూట్ హల్ లో కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలతో జిల్లాస్థాయి "సంఘటన్ సృజన్ అభియాన్" కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అబ్జర్వర్ సూరజ్ సింగ్ ఠాగూర్ గారు,పీసీసీ అబ్జర్వర్లు ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ హాజరయ్యారు.డిసిసి అధ్యక్ష పదవి కోసం దరఖాస్తులను స్వీకరించారు.అనంతరం బూత్ స్థాయి కార్యకర్తలతో ఏఐసీసీ ఇన్‌చార్జ్ సూరజ్ సింగ్ ఠాగూర్ గారు మాట్లాడి,పార్టీ బలపర్చడంలో ప్రతి కార్యకర్త పాత్ర కీలకమని పేర్కొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి : జిల్లా కలెక్టర్ రాజర్షి షా



సత్యమేవ జయతే – ఆదిలాబాద్ ఆదిలాబాద్ : మహిళలు ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలో పర్యటించారు. బుద్ధ విహార్‌లో ఏర్పాటుచేసిన బాంబు క్రాఫ్ట్ తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ పాఠశాలలు, స్వ స్వస్థన్ ట్రస్ట్‌ను సందర్శించారు. పాఠశాలలో భవిత కేంద్రాన్ని ప్రారంభించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి ఆంగ్లంలో చదవడం, రాయడం వచ్చేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రజలకు వైద్యం అందిస్తున్న తీరును వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. నార్నూర్ అభివృద్ధికి కృషి చేయాలని పలు అంశాలతో కూడిన వినతి పత్రాన్ని సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్ వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం గుండాల గ్రామాన్ని కలెక్టర్ సందర్శించారు. జడ్పీ సీఈవో రాథోడ్ రవీందర్, డీఎంహెచ్ వో రాథోడ్ నరేందర్, తహసీల్దార్ జాడి రాజలింగం, ఎంపీడీవో రాథోడ్ గంగా సింగ్, డీఈలు శ్రీనివాస్, జాడి లింగన్న, స్థానిక నాయకులు ఉన్నారు.

## ప్యారిస్ (ఫ్రాన్స్).బార్డడోస్ దేశంలో జరిగిన సమావేశం లో పాల్గొన్న స్పీకర్.. గడ్డం ప్రసాద్ కుమార్..



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..బార్బడోస్ దేశంలో జరిగిన సీపీ ఏ కాన్ఫరెన్స్ అనంతరం స్టడీ టూర్లో భాగంగా ఫ్రాన్స్ లో పర్యటిస్తున్న తెలంగాణ శాసన బృందం. ఈరోజు ప్యారిస్ లోని భారతదేశ రాయబార కార్యాలయంలో ఛీఫ్ అంబాసిడర్ సంజీవ్ సింఘాలా సమావేశమైన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ నాయకత్వం లోని తెలంగాణ శాసన బృందం.పరిశీలించడం జరిగింది.

## బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆమోదం ఇవ్వాలని నేటివ్ ఇండియన్స్ ఫోరమ్ జాతీయ అధ్యక్షుడు బీరయ్య యాదవ్ డిమాండ్

**-బీసీ ల హక్కుల పరిరక్షణలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం**

**- బీసీల ఆత్మగౌరవ పోరాటానికి నేటివ్ ఇండియన్స్ ఫోరమ్ మద్దతు**

సత్యమేవ జయతే – సంగారెడ్డి సంగారెడ్డి : తెలంగాణ రాష్ట్రంలో బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసి, కుల లెక్కలు నిర్వహించి, 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడం ద్వారా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని నేటివ్ ఇండియన్స్ ఫోరమ్ జాతీయ అధ్యక్షుడు బీరయ్య యాదవ్ గారు తెలిపారు.

ఈ బిల్లుకు ఇప్పుడు ఆమోదం ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. గవర్నర్ గారు, రాష్ట్రపతి గారు కూడా బీజేపీ నియమితులే కాబట్టి ౦ ఈ బిల్లుకు ఆమోదం ఇవ్వడంలో ఎటువంటి అడ్డంకులు ఉండకూడదని వ్యాఖ్యానించారు.



బీసీ వర్గాల పట్ల నిజమైన ప్రేమ, నిబద్ధత బీజేపీకి ఉంటే వెంటనే ఈ బిల్లును ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం బీసీల భవిష్యత్తు, గౌరవం, రాజకీయ భాగస్వామ్యానికి అత్యంత కీలకమని ఆయన అన్నారు.

ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ విషయంలో ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం, బీసీ రిజర్వేషన్ విషయంలో మాత్రం ఎందుకు ఆలస్యం చేస్తోందని ప్రశ్నించారు. ఇది బీసీల హక్కులపై వివక్షతకు నిదర్శనమని పేర్కొన్నారు.

బీసీ వర్గాల ఆత్మగౌరవం, హక్కులు, వాటా ౦ ఇవి ఎవరి దయతో ఇచ్చే వరాలు కాదని, ఇవి రాజ్యాంగబద్ధమైన హక్కులు అని బీరయ్య యాదవ్ గారు తెలిపారు. ఈ హక్కులను రాజకీయ ప్రయోజనాల కోసం ఎప్పటికప్పుడు వాయిదా వేయడం దారుణమని ఆయన అన్నారు.

ఇలాంటి సమయంలో బీసీ వర్గాల ఐక్యతే సమాధానం అని పిలుపునిచ్చారు. అక్టోబర్ 18న జరుగనున్న బీసీ బంద్‌కు నేటివ్ ఇండియన్స్ ఫోరమ్ జాతీయ స్థాయిలో సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు.

ఈ ఉద్యమం కేవలం రిజర్వేషన్ల కోసం మాత్రమే కాదని, ఇది బీసీల గౌరవం, వాటా, హక్కుల కోసం జరుగుతున్న ఆత్మగౌరవ పోరాటమని బీరయ్య యాదవ్ పేర్కొన్నారు.

బీసీ బంద్ విజయవంతం కావాలని, బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## కూలీలకు పనులు కల్పించాలి : ఏపీడీ యామిని

సత్యమేవ జయతే – నల్గొండ నల్గొండ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు అడిగిన వెంటనే పనులు కల్పించాలని ఏపీడీ యామిని అన్నారు. కట్టంగూర్ మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 1-4-2024 నుండి 31-3-2025 వరకు జరిగిన పనులపై శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. మండలంలోని 22 గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికను చదివి వినిపించారు.

మండలంలో మొత్తం రూ.6,010,55,35 కోట్లు ఖర్చు చేయగా కూలీలకు రూ.5,87,66,440, సామాగ్రికి రూ.1,33,90,96 చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఉపాధి హామీ సిబ్బందితో పాటు పంచాయితీ కార్యదర్శుల నుంచి రూ.266ను రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ టీ ఎం వేణు, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞాన ప్రకాష్ రావు, డీవీఓ చకిలం




వేణుగోపాలరావు, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ గౌతమి, ఎంపీఓ స్వరూపారాణి, ఏపీఓ కడెం రాంమోహన్, పీఆర్ ఏఈ జమీల్, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ అమలులో ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలదే కీలక పాత్ర : కలెక్టర్





సత్యమేవ జయతే – మెదక్

మెదక్ : మెదక్ జిల్లా హవేలీ ఘన్‌పూర్ మండలం డైట్ కళాశాలలో, ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) అమలుపై ఆయా మండలాల ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎఫ్ఎల్ఎన్ అమలులో భాగంగా ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు కనీస సామర్థ్యాలు పెంచి గుణాత్మక విద్యాబోధన ద్వారా బావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ముందుకు పోతుందని ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థుల సామర్థ్యాలు పెంపు దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, విధిగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని, పట్టిష్టంగా అమలు చేసి విద్యార్థులందరు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఈ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులందరూ 100 శాతం ఉత్తీర్ణత పొందే విధంగా కృషిచేయాలని, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు పాఠశాలలను సందర్శించినప్పుడు ఒక పాఠశాలలో సుమారు 35 నిమిషాల సమయం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

## శృంగారంలో ఉండగా గుండెపోటు వచ్చిందని..మొగుడ్ని లేపేసిన భార్య..!!

ఖసత్యమేవ జయతే -కరీంనగర్ డబ్బుల కోసం వేధిస్తున్నాడని కట్టుకున్న భర్తను చంపేసింది ఓ భార్య. కరీంనగర్ లో జరిగిన ఈ ఘటనలో నిందితురాలితో పాటుగా మరో ఐగురుగురిని కరీంనగర్ టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కమిషనరేట్‌లో గురువారం సీపీ గౌస్ ఆలం కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కత్తి మౌనిక, సురేశ్ 2015లో లవ్ మ్యారేజ్ చేసుకున్నారు. సప్తగిరికాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు.

అయితే ఇటీవల మౌనిక సెక్స్‌వర్కర్‌గా మారింది. అయితే సురేశ్ నిత్యం డబ్బుల కోసం వేధించడంతో విసిగిపోయిన మౌనిక భర్తను చంపాలని నిర్ణయించుకుంది. అయితే ఇందుకోసం తన బంధువులైన అరిగె శ్రీజ, పోతు శివకృష్ణ, దొమ్మాటి అజయ్, నల్ల సంధ్య ఈరాఫ్ వేముల రాధ, నల్ల దేవదాస్ సాయం కోరింది. ఇందుకు వారు కొన్ని సూచనలు కూడా ఇచ్చారు. ఒకరోజు వయాగ్రా మాత్రలు కూరలో కలిపి చంపాలని ప్రయత్నించగా, వాసన రావడంతో సురేశ్ దానిని తినలేదు.



ప్లాన్ బీలో భాగంగా%ౌ% సెప్టెంబర్17న సురేశ్ మద్యం తాగుతుండగా.. అందులో బీపీ, నిద్ర మాత్రలు పొడిగాచేసి అందులో కలిపింది. అది తాగిన సురేశ్ అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. దీంతో సురేశ్ మెడకు చీరను బిగించి, కిటికి గ్రిల్‌కు వేలాడదీసి ఉరేసి చంపేసింది. శృంగారం చేస్తుండగా.. స్పృహ కోల్పోయాడని తన అత్తమామలకు చెప్పింది. వెంటనే సురేశ్ ను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే సురేశ్ మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. మౌనిక ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమె కదలికలపై ఫోకస్ పెట్టారు. లోతుగా దర్యాప్తు చేయగా మౌనిక అసలు నిజం ఒప్పుకుంది. తానే అరిగెశ్రీజ, పోతు శివకృష్ణ, దొమ్మాటి అజయ్, వేముల రాధ, నల్ల దేవదాస్ సాయంతో హత్య చేసినట్టు ఒప్పుకుంది. నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి, గురువారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు..!!

## బీసీ బంద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి.. డీజీపీ శివధర్ రెడ్డి కీలక సూచనలు.




సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.(అక్టోబర్ 18) చేపట్టనున్న బంద్ నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికపోలీస్ సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశాలు బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించిన డీజీపీ శివధర్ రెడ్డి.తెలిపారు.

## పీజీ సెంటర్లలో పార్ట్ టైం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ పీజీ సెంటర్లలో పార్ట్ టైం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ పీజీ కాలేజెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్స్, కెమిస్ట్రీ, లైబ్రెరీ సైన్స్, ఇంగ్లీష్ తదితర విభాగాలలో పార్ట్ టైం లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) మార్కులతో పీజీ ఉత్తీర్ణులైన వారు అర్హులని చెప్పారు. పీహెచ్‌డీ, ఎంఫిల్‌లతో పాటు నెట్, సెట్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పోస్టుల భర్తీని పూర్తిగా ఉస్మానియా యూనివర్సిటీ నియమ నిబంధనలకు అనుగుణంగా చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలతో ఈ నెల 24వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి: నవాబ్‌పేటలో ఎంఆర్‌పీఎస్ నిరసన

**జస్టిస్ గవాయ్‌పై దాడి ప్రజాస్వామ్యంపై దాడిగా భావించిన ఎమ్మార్పీఎస్‌: నాయబ్ తహసీల్దార్‌కు వినతి**



సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబుపేట్, అక్టోబర్ 17 : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ గారిపై జరిగిన దాడిని న్యాయవ్యవస్థ, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా పరిగణిస్తూ ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్త ఉద్యమ కార్యాచరణలో భాగంగా, నవాబ్‌పేట మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు.

నవాబ్‌పేట్ మండల అధ్యక్షుడు దాసరి సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దాడిపై లోతైన దర్యాప్తుకు డిమాండ్

సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్ పై లోతైన దర్యాప్తు జరిపి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

దాసరి సుధాకర్ మాదిగ మాట్లాడుతూ, న్యాయవ్యవస్థకు భద్రత కరువైతే సామాన్య పౌరులకు న్యాయం ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఈ దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగినది కాదని, భారతదేశ ప్రజాస్వామ్య మూల స్తంభాలపై జరిగిన దాడిగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు.

నిరసనకారులు మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం, నవాబ్‌పేట తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి, ఈ దాడిని ఖండిస్తూ, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నాయబ్ తహసీల్దార్ గారికి వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రవి కుమార్, శివ ప్రసాద్, చిట్టిగిద్ద కిష్టయ్య, యాదగిరి, మాధవ్, అనిల్, ప్రేమ్, నర్సిములు, వెంకటయ్య, రాములు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు. న్యాయవ్యవస్థకు భద్రత కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# నిస్వార్థ సేవకు నీరాజనం: 'ఆర్ఆర్ఆర్' రవీందర్ రెడ్డి రాజకీయ ప్రవేశంపై నవాబ్‌పేటలో తీవ్ర చర్చ



రత్నమొల్ల రవీందర్ రెడ్డి (ఆర్.ఆర్.ఆర్)





**పాములు, విషపదార్థాల ప్రమాదం నుంచి విద్యార్థులకు రక్షణ: పదవి లేకుండానే గొప్ప సేవ**

**- ప్రజా ప్రతినిధిగా రావాలని మండల ప్రజల విజ్ఞప్తి**

సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబుపేట్, అక్టోబర్ 17 :నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తూ, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థుల ఇబ్బందులను తీర్చిన సామాజిక కార్యకర్త రవీందర్ రెడ్డి (ఆర్ఆర్ఆర్) సేవ ఇప్పుడు నవాబ్‌పేట మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ఎలాంటి రాజకీయ పదవి లేకుండానే ఆయన చేస్తున్న అసాధారణ సేవలు స్థానిక ప్రజల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, ఆయన రాజకీయాల్లోకి రావాలని, ప్రజా ప్రతినిధిగా ఎన్నికైతే మండల దశ మారుతుందని ప్రజలు బలంగా కోరుకుంటున్నారు.

**అవస్థలో ఉన్న విద్యార్థులకు ఊరట, ప్రాణాపాయం నుంచి రక్షణ**

శుక్రవారం నాడు, నవాబ్‌పేట్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజ్ ప్రాంగణంలో గడ్డి, చెత్తాచెదారం అధికంగా పేరుకుపోయాయి. ముఖ్యంగా, ఆ పరిసరాలలో పాములు మరియు ఇతర విషపదార్థాలు చేరే అవకాశం ఉండటంతో విద్యార్థులు ప్రమాదకరమైన పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ విషయాన్ని గమనించిన రవీందర్ రెడ్డి, తక్షణమే స్పందించి, తన బృందంతో కలిసి శుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. చెత్తాచెదారాన్ని తొలగించి, పరిసరాలను శుభ్రం చేయడం ద్వారా ఆయన విద్యార్థులకు, పాఠశాలకు గొప్ప ఊరట, ముఖ్యంగా భద్రత కల్పించారు. ఆయన చేసిన ఈ నిస్వార్థ సేవకు విద్యార్థులు మరియు మోడల్ స్కూల్ మేనేజ్‌మెంట్ ఆయనకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసి, ఇలాంటి మంచి పనులు కొనసాగించాలని ఆకాంక్షించారు.

**సేవే పునాదిగా రాజకీయ ఆకాంక్ష**

ఎలాంటి పదవి లేకున్నా, ప్రజల కష్టాలను గుర్తించి, వాటిని తీర్చేందుకు స్వయంగా రంగంలోకి దిగుతున్న రవీందర్ రెడ్డి సేవలు మండల ప్రజలను కదిలించాయి. ఆయన సేవలో స్ఫూర్తిని నింపుతున్న 'ఆర్ఆర్ఆర్'పై స్థానికుల్లో అమితమైన అభిమానం పెరిగింది.

స్థానిక ప్రజలు తమ అభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేస్తూ, "ఒక రాజకీయ పదవి లేదా అధికారం అండ లేకుండానే ప్రజల కష్టాలను గుర్తించి, ఇంత మంచి సేవా కార్యక్రమాలు చేస్తుంటే, ఇక రాజకీయ పదవిలో ఉంటే ఇంకెంత మంచి చేస్తారో ఊహించవచ్చు" అని అన్నారు.

"రవీందర్ రెడ్డి లాంటి నిస్వార్థ నాయకులు రాజకీయాల్లోకి రావాలి. ప్రజా ప్రతినిధిగా ఎన్నికైతే, మండలంలోని మౌలిక వసతులు, పేద ప్రజల సమస్యలు మరింత వేగంగా పరిష్కారమవుతాయి. రాజకీయాల్లోకి వచ్చి, ప్రజా ప్రతినిధిగా ఉండి, మరింత మెరుగైన సేవా కార్యక్రమాలు చేయాలని నవాబ్‌పేట మండల ప్రజలమంతా ఆకాంక్షిస్తున్నాము" అని వారు విజ్ఞప్తి చేశారుసామాజిక సేవకుడిగా ఆదర్శంగా నిలిచి, ప్రజల మనసులను గెలుచుకున్న రవీందర్ రెడ్డి, ప్రజల కోరిక మేరకు భవిష్యత్తులో రాజకీయాల్లోకి అడుగుపెడతారా లేదా అనే చర్చ ప్రస్తుతం నవాబ్‌పేట రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

## నవాబ్‌పేటలో 'హాప్ డైలీ ఫామ్ షాప్' గ్రాండ్‌గా ప్రారంభం





**చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య చేతులమీదుగా లాంఛనం**

సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబుపేట్, అక్టోబర్ 17:నవాబుపేట్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'హాప్ డైలీ ఫామ్ షాప్'ను చేవెళ్ల ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య శుక్రవారం గ్రాండ్‌గా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే యాదయ్య గారు, "ప్రజలకు నాణ్యమైన, తాజా పాలు మరియు పాల ఉత్పత్తులు అందించాలనే లక్ష్యంతో ఈ ఫామ్ షాప్ ప్రారంభించడాన్ని అభినందించాలి. ఇలాంటి ప్రయత్నాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి," అని పేర్కొన్నారు.

రైతులకు ఉత్పత్తి విక్రయానికి కొత్త మార్గాలు తెరుస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచే కార్యక్రమాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

అదేవిధంగా యువతకు సందేశమిస్తూ, "ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రమే ఎదురు చూడకుండా వ్యాపార రంగంలోకి రావాలి. ఇలాంటి ప్రయత్నాలు స్వయం ఉపాధి మార్గాలను తెరిచి పెట్టడమే కాకుండా, ఇతరులకు కూడా అవకాశాలు కల్పిస్తాయి," అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక రైతులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీ బంద్‌కు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు: నవాబ్‌పేటలో మేడిపల్లి వెంకటయ్య ప్రకటన

**స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్ల అమలుకు డిమాండ్‌: శనివారం ఉదయం 11 గంటలకు చౌరస్తాలో నిరసన**



సత్యమేవ జయతే – వికారాబాద్ జిల్లా / నవాబుపేట్, అక్టోబర్ 17 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాలు ఈ రోజు (అక్టోబర్ 18, 2025, శనివారం) తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు నవాబ్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

కాంగ్రెస్ పార్టీ నవాబుపేట మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య ఈ రోజు ఈ మేరకు అధికారిక ప్రకటన చేశారు. టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ గారి ఆదేశానుసారం, బీసీల న్యాయమైన హక్కుల కోసం జరుగుతున్న ఈ బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు వెంకటయ్య గారు తెలిపారు.

బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు:

ఈ రోజు (అక్టోబర్ 18) బంద్‌ను నవాబ్‌పేట మండలంలో విజయవంతం చేయాలని మేడిపల్లి వెంకటయ్య గారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రోజు ఉదయం 11:00 గంటలకు మండలంలోని మెయిన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ నిరసనలో అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. అంతేకాకుండా, అన్ని పార్టీలకు అతీతంగా బీసీల సంక్షేమం కోసం పాటుపడుతున్న అనుబంధ సంఘాల నాయకులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌కు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత పై హర్షం



సత్యమేవ జయతే కొండాపూర్ సత్యమేవ జయతే దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్నాడు గురజాడ.. దేశ అభ్యున్నతికై, రాష్ట్ర అభివృద్ధి అయినా జనాభా మీదే ఎక్కువ ఆధారపడి ఉంటుందని అందుకే జనాభా వాటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్రం తొలి అడుగు వేసిందని ఇద్దరు పిల్లల నిబంధన పై మేలైన చట్ట సవరణ ద్వారా ప్రజల మనోభావాలను అర్థం చేస్తుందని కాంగ్రెస్ నాయకులు ఆనంద వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రభుత్వం ఈ మార్పుకు శ్రీకారం చుట్టడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలు అభినందనలు తెలియజేస్తున్నాయని తెలిపారు.ఇద్దరు పిల్లలు అంతకన్నా ఎక్కువ సంతానం ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయవచ్చని నిబంధనను ఎత్తివేయడం అభినందనీయమని అన్నారు. క్యాబినెట్ మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితర పాలకవర్గాలకు ఎమ్మెల్యేలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏది ఏమైనా, ఈ చట్ట సవరణ స్థానిక సంస్థల రాజకీయాలపై ప్రభావం చూపుతుందని మైళి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇద్దరు కన్నా ఎక్కువ సంతానం ఉన్నవాళ్లు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడం వల్ల ప్రజాస్వామ్య విలువల పునరుద్ధరణ జరుగుతుందని పేర్కొన్నారు.

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను కలిసిన ఆర్ కృష్ణయ్య

**తెలంగాణ బంద్‌కు మద్దతు కోరిన ఆర్ కృష్ణయ్య**

**సంపూర్ణ మద్దతు ప్రకటించిన కవిత**

**తెలంగాణ జాగృతి బీసీల పక్షపాతి అన్న కవిత**

బీసీ సంఘాలు నిర్వహించనున్న బంద్‌కు మద్దతు తెలపాలని బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఆర్. కృష్ణయ్య, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను కలిసి విజ్ఞప్తి చేశారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ కులాలు పిలుపునిచ్చిన బంద్‌కు కవిత సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తెలంగాణ జాగృతి బీసీల పక్షపాతి అని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మభ్యపెడుతున్నాయని ఆమె విమర్శించారు. తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఎక్కడికక్కడ బంద్‌లో పాల్గొంటారని హామీ ఇచ్చారు. బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంటులో చట్టం చేసేంత వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని తెలిపారు.బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా పోరాటం చేద్దామని కవిత పిలుపునిచ్చారు. బీసీ వర్గానికి చెందిన వారు కాకపోయినా బీసీల కోసం కవిత పోరాటం చేయడం అభినందనీయమని ఆర్ కృష్ణయ్య ప్రశంసించారు.

# దేశంలో మగాడికి కష్టం వచ్చింది!

సత్యమేవ జయతే సంగారెడ్డి: ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. వాస్తవాలు ఇంకా భయంకరంగా ఉన్నాయి. దేశంలో ప్రతి ఏడాది వేలాది మంది పురుషులు తమ ప్రాణాలు తీసుకుంటున్నారు. 2004 లో 51,623 మంది వివాహిత పురుషులు ఆత్మహత్య చేసుకోగా, 2021 నాటికి ఈ సంఖ్య 81,063 కి పెరిగింది.

అదే సమయంలో వివాహిత మహిళల సంఖ్య మాత్రం 28,045 నుండి 28,680 వరకు మాత్రమే ఉంది. అంటే వివాహిత మహిళల సంఖ్య అలాగే ఉండగా, పురుషుల సంఖ్య 50శాతం పెరిగింది. ఇవి కేవలం గణాంకాలు కాదు, మన సమాజంలో పురుషుల మానసిక ఆరోగ్యం కూలిపోతుందనడానికి సంకేతం. దీనికి కారణాలు తెలుసుకుని, పరిష్కారాలు అన్వేషించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మొదట కారణాలు తెలుసుకుందాం.

1. కుటుంబ సంబంధాల ఒత్తిడి

ఈ మధ్య మా క్లినిక్ కు కౌన్సెలింగ్ కు వచ్చిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన కష్టాలు చెప్పుకుని కన్నీళ్లు పెట్టుకున్నాడు. "సర్, నా జీతం సరిపోవడంలేదని నా భార్య తిట్టింది. మరోవైపు అమ్మ, తన మాట వినడంలేదని ఎత్తిపొడుస్తోంది. ఇద్దరినీ సంతోషపెట్టాలనుకున్నా, కానీ ఎవ్వరూ సంతోషంగా లేరు. చచ్చిపోవాలనిపిస్తుంది" అని వాపోయాడు.

మగాడు కుటుంబానికి 'రక్షకుడు' అనే భావన బలంగా ఉంది. దీంతో పిల్లల భవిష్యత్తు, ఇంటి భారం, తల్లిదండ్రుల బాధ్యతలన్నీ పురుషులు మోస్తారు. వీటిలో విఫలమైనప్పుడు తీవ్రమైన అపరాధభావనకు, నిస్సహాయతకు, ఆత్మన్యూనతకు లోనవుతారు. ఇంటి సమస్యలు, భార్యతో విభేదాలు, వృత్తి ఒత్తిడి... ఇవన్నీ బయటకు చెప్పుకోలేని స్థితిలో, ఆ ఒత్తిడి ఆత్మహత్యవైపు నడిపించే ప్రమాదం ఉంది.

**2. మానసిక సమస్యలపై మౌనం**

మగాళ్లు ఏడవకూడదు, ధైర్యంగా ఉండాలి, సమస్యలను తనలోనే దాచుకోవాలనే సామాజిక కట్టుబాట్లు పురుషులకు అతిపెద్ద శత్రువులు. ఈ భావనను టాక్సిక్ మాస్క్యులినిటీ అంటారు. దీనివల్ల పురుషుడు తమ ఎమోషన్స్, బాధ, భయం, ఆందోళన వంటి వాటిని మనసులోనే తొక్కిపెడతాడు. డిప్రెషన్, యాంగ్జయిటీలాంటి సమస్యలున్నా సైకాలజిస్ట్ దగ్గరకు వెళ్లడాన్ని బలహీనతగా భావిస్తారు. 'నేను బలహీనుడిని కాను' అని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. ఆ అణచివేత చివరకు మానసిక ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీసి తీవ్ర నిర్ణయాలవైపుకు నెడుతుంది.

**3. ఆర్థిక ఒత్తిళ్లు...**

కరోనా తర్వాత చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. కొంతమంది అప్పుల్లో కూరుకుపోయారు. ఇది వారి ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. వారి గుర్తింపు ఉద్యోగం, సంపాదనతో ముడిపడి ఉండటమే దీనికి కారణం. అందరిముందూ తల దించుకోవాల్సిన పరిస్థితి, అవమాన భారం, భవిష్యత్తుపై అభద్రతాభావం వారిని నిరాశలోకి నెట్టేస్తాయి. ఇటీవల బెంగళూరులో ఒక టెకీ ఉద్యోగం కోల్పోయి ఆత్మహత్య చేసుకున్నట్లు వచ్చిన వార్త దీనికి నిదర్శనం.




4. చట్టపరమైన ఒత్తిళ్లు...

మరికొంతమంది పురుషులు వివాహ సంబంధిత చట్టాలు, కుటుంబ వివాదాలు, లేదా తప్పు ఆరోపణలు వల్ల తీవ్రమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. "నేను తప్పు చేయలేదు, కానీ ఎవరూ నమ్మలేదు" అని కొద్ది నెలల క్రితం బెంగళూరులో ఒక టెకీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలాంటి ఘటనలు మన సమాజంలో మగాళ్ల బాధను ఎవరూ వినడం లేదనే భావనను పెంచుతున్నాయి.

**5. మత్తు పదార్థాలు...**

చాలామంది పురుషులు మద్యం లేదా డ్రగ్స్ ద్వారా తాత్కాలిక ఉపశమనం పొందాలని ప్రయత్నిస్తారు. కానీ అది ఒక్కరోజు సాంత్వన మాత్రమే. మరుసటి రోజు మళ్లీ అదే బాధ, అదే శూన్యత, మళ్లీ మద్యం. అలా అలా దానికి బానిసలవుతారు. ఈ విషవలయం చివరకు స్వీయ విధ్వంసానికి దారి తీస్తుంది.

**6. ఒంటరితనం...**

మహిళలకు కష్టమొస్తే వెంటనే ఎవరో ఒకరితో పంచుకుంటారు. కానీ పురుషులు మాత్రం మౌనంగా భరిస్తారు. కాఫీ లేదా స్క్రీన్‌తో మాట్లాడతారు. ఓసారి ఒక 42 ఏళ్ల వ్యక్తి ఏమన్నాడో తెలుసా? "నాకు స్నేహితులు ఉన్నారు. వాళ్లు అడిగేది... జీతం ఎంత? కారు కొత్తదా? అని. నిజంగా నా మనసులో ఏముందో విన్నవాడు లేడు" అని చెప్పాడు. అదీ పరిస్థితి.

**గణాంకాలు చెబుతున్నది ఏమిటి?**

భారతదేశంలో మొత్తం ఆత్మహత్యలలో 70% కంటే ఎక్కువ పురుషులవి.

18-45 ఏళ్ల మధ్య వయసు గలవారు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

లి వివాహిత మహిళల కంటే వివాహిత పురుషులు 1.8 రెట్లు ఎక్కువగా ప్రాణాలు తీసుకున్నారు.

కుటుంబ సమస్యలు పురుషుల ఆత్మహత్యలకు ప్రధాన కారణంగా ఉంది.

**పరిష్కార దిశలు**

1. మానసిక సమస్యల గురించి మాట్లాడాలి. పురుషుడికి కూడా సహాయం అవసరం అవుతుందని అంగీకరించాలి.
2. కౌన్సెలింగ్‌ను మొదటి అడుగుగా చూడాలి, చివరి ప్రయత్నంగా కాదు.
3. 'మగాడు ఏడవకూడదు' అన్న మాట మార్చాలి. ఎమోషన్స్ కు జెండర్ తో సంబంధం లేదని గుర్తించాలి.
4. తండ్రులు, భర్తలు, సోదరులు మాట్లాడుకునే సపోర్ట్ గ్రూపులు ఏర్పాటు చేయాలి.
5. మీడియా పురుషుల బాధను నాటకీయంగా కాకుండా, అవగాహనతో చూపించాలి.

ఒక పురుషుడు చనిపోవడమంటే, ఒక తండ్రి, ఒక కుమారుడు నిశ్శబ్దంగా మాయమవ్వడం. ఒక కుటుంబం కష్టాల్లో, దు:ఖంలో పడటం. ఆత్మహత్యలు కేవలం వ్యక్తిగత వైఫల్యాలు కాదు, అవి సామాజిక వైఫల్యాలు. పురుషులు కూడా మనుషులే, వాళ్లకు కూడా అర్థం చేసుకునే హృదయం అవసరం.

# ఉల్లిపాయల పండుగ!



రకరకాల ఉత్సవాల గురించి విని ఉంటారు. ఎన్నో పండుగలు జరుపుకొని ఉంటారు. కానీ స్విట్జర్లాండ్‌లో జరిగే ఒక ఉత్సవం మాత్రం చాలా భిన్నమైంది. ఎందుకంటే ఈ ఉత్సవంలో ఉల్లిపాయలను అలంకరించి ప్రదర్శిస్తారు.

ఏటా స్విట్జర్లాండ్‌లో ఆనియన్ ఫెస్టివల్ నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఉల్లిపాయలను పోలిన దుస్తులు ధరిస్తారు. ఆట పాటలతో సందడిగా గడుపుతారు. ఉత్సవంలో ఎటుచూసినా రకరకాల రూపాల్లో అలంకరించిన ఉల్లిపాయలే కనిపిస్తాయి. వ్యాపారులు, రైతులు ఉల్లిపాయలను అలంకరించి ప్రదర్శనకు పెడతారు. ఈ ఫెస్టివల్‌ను చూడడానికి దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. రకరకాలుగా అలంకరించిన ఉల్లిపాయలను కొనుగోలు చేయడానికి సందర్శకులు ఆసక్తి చూపిస్తారు. ఇక ఫెస్టివల్‌లో ఉల్లిపాయలతో చేసిన రకరకాల వంటలు నోరూరిస్తాయి.

# చెక్కుచెదరని టవర్!



వందేళ్ల క్రితం నిర్మించిన పద్నాలుగు అంతస్థుల టవర్ ఇప్పటికీ చెక్కు చెదరలేదు. లండన్‌లోని స్వే అనే గ్రామంలో ఉన్న ఈ టవర్ నిర్మాణం వెనకఅనేక విశేషాలున్నాయి.ఆండ్రూ థామస్ అనే వ్యక్తి ఈ టవర్ నిర్మించాడు. 1879లో మొదలెట్టి 1985లో పూర్తిచేశారు. ఈ కట్టడానికి 40 మంది కూలీలు ఆరేళ్లపాటు శ్రమించారు. ఈ టవర్ 216 అడుగుల ఎత్తు, 18 అడుగుల వ్యాసార్థంతో ఉంటుంది. ఈ టవర్ ప్రత్యేకత ఏమిటంటే దీని నిర్మాణంలో స్టీల్ ఉపయోగించలేదు. స్టీల్ వాడకుండా నిర్మించిన అతి ఎత్తైన నిర్మాణంగా ఈ టవర్ గుర్తింపు పొందింది. నిర్మాణం పూర్తయ్యాక చాలా ఏళ్ల వరకు నిరుపయోగంగానే ఉంది. 45 ఏళ్ల క్రితం దీన్ని నివాస గృహంగా మార్చారు. టవర్ పై భాగం విశాలంగా ఉంటుంది. వస్తువులన్నీ అమర్చుకోవడానికి కావలసినంత స్థలం ఉంటుంది.



# పట్టు తప్పితే... గల్లంతే!

మీరు చెట్లు ఎక్కగలరేమో కానీ ఈ మెట్లు ఎక్కలేరు. ఎందుకో తెలుసా? ఈ మెట్లు ఎక్కాలంటే బోలెడంత గుండె ధైర్యం కావాలి. పొరపాటున కాలు జారితే గల్లంతవ్వడం ఖాయం. వీటిని 'హైకూ మెట్లు' అని పిలుస్తారు. ఇంతకీ ఇవి ఎక్కడున్నాయో తెలుసా?అమెరికా హవాయి ద్వీపాల్లో ఒకటైన ఒహాహు ద్వీపంలో ఈ మెట్లు ఉన్నాయి. వీటిని 1942లో అమెరికా నౌకాదళం నిర్మించింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న తమ నౌకలకు రేడియో సంకేతాలు అందించడానికి ఎత్తైన ప్రదేశంలో యాంటెన్నా నిర్మించాలని నౌకాదళం భావించింది.

అందుకోసం ఈ కొండ ప్రాంతాన్ని ఎంచుకుంది. కొండపైకి చేరుకోవడానికి మెట్లు ఏర్పాటు చేసింది. మొత్తం 3922 మెట్లు ఉన్నాయి. కొన్ని చోట్ల మెట్లు కొండపైకి నిట్టనిలువుగా ఉంటాయి. ప్రకృతి ప్రేమికులు, సాహసాలను ఇష్టపడే వారు ఈ మెట్లు ఎక్కి కొండపైకి చేరుకునేందుకు ఉత్సాహం చూపుతుంటారు. కొండపై నుంచి చూస్తే ప్రకృతి సౌందర్యం ఆకట్టుకుంటుంది. ఱఅయితే ఇక్కడ ప్రమాదాలు జరగడంతో సాధారణ ప్రజలు ఈ మెట్లు ఎక్కకుండా నిషేధం విధించారు.

# కాగితం పువ్వు

కావలసిన వస్తువులు:

రంగు కాగితాలు
స్ట్రా
పెన్సిల్
కత్తెర
జిగురు
టేప్



**తయారుచేయు విధానం:**

తెల్లకాగితంపై పువ్వు రేకులను గీయండి. తరువాత ఆ గీతల వెంబడి కత్తిరించండి. ఫ ఇప్పుడు మొదటి రేకును చివరి రేకును జిగురుతో అతికించండి. ఫ ఈ పువ్వును స్ట్రాకి ఒక చివర టేప్‌తో అతికించండి. పసుపు రంగు కాగితాన్ని స్ట్రాపై అతికించండి. ఆకుపచ్చరంగు కాగితంతో కొన్ని ఆకులను తయారు చేసుకోండి. ఈ ఆకులను స్ట్రాకి రెండు వైపులా అతికిస్తే కాగితం పువ్వు రెడీ!

సత్యమేవ జయతే
శనివారం 18 అక్టోబర్ 2025

# మహేంద్రజాలం చూడాల్సిందే!







తూర్పుకనుమల్లో అందాలు నెలకొన్న కొండలు మహేంద్రగిరులు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో పర్వత శ్రేణులపై ప్రకృతి ఎప్పుడూ పరవశిస్తూ ఉంటుంది. చెట్లు, చేమలతో పచ్చలపేరులా మెరిసిపోతున్న మహేంద్రగిరుల్లో.. అక్కడక్కడా వజ్రాలు పొదిగినట్టుగా అపురూప ఆలయాలు దర్శనమిస్తాయి. ముత్యాలు కుమ్మరించినట్టుగా నీటి చెలమలు కనిపిస్తాయి. ఈ గిరులకు ఏడాదంతా పర్యాటకుల తాకిడి ఉంటుంది. ముఖ్యంగా శివరాత్రి సందర్భంగా వేల మంది భక్తులు తరలి వస్తారు. ఇక్కడి పాండవుల ఆలయాలను సందర్శిస్తారు. ఆ చుట్టుపక్కల వాళ్లు ప్రతిష్ఠించిన మహాలింగాలను భక్తితో పూజిస్తారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం సింగుపురం సమీపంలో ఉంటాయి మహేంద్రగిరులు. సముద్ర మట్టానికి ఐదువేల అడుగుల ఎత్తులో ఉన్నాయివి. అరుదైన వృక్షసంపద వీటి సొంతం. వనవాసకాలంలో పాండవులు మహేంద్రగిరులపై కొంతకాలం గడిపారని చెబుతారు. ఆ సమయంలో ఒక్కొక్కరూ ఒక్కో మందిరాన్ని నిర్మించుకొన్నారని స్థానిక కథనం. అందుకు తగ్గట్టుగా ఇప్పుడు అక్కడ పాండవుల పేరిట ఆలయాలు కనిపిస్తాయి. ధర్మరాజు, కుంతీదేవి ఆలయాలు ఒక ప్రదేశంలో ఉండగా.. భీమసేనుడి ఆలయం ఎత్తయిన శిఖరంపై కనిపిస్తుంది. అక్కడికి కొంత దూరంలో అర్జునుడు, నకుల, సహాదేవుల ఆలయాలు ఉన్నాయి. వీటి పరిసర ప్రాంతాల్లో పాండవులు ప్రతిష్ఠించారని భావించే లింగాలు కనిపిస్తాయి. కాలప్రవాహంలో ఆలయాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. అయినా.. వాటి ప్రాశస్త్యం మాత్రం తగ్గలేదు. ఏటా శివరాత్రి సందర్భంగా మహేంద్రగిరులపై జరిగే ఉత్సవాలకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు వస్తుంటారు. పిల్లలు, పెద్దలు వ్యయప్రయాసలకోర్చి సాహసయాత్రకు పూనుకుంటారు. శివరాత్రికి ఒకరోజు ముందుగానే భక్తులంతా గిరులపైకి చేరుకుంటారు. పూజాసామగ్రి, మంచినీళ్లు, ఆహారం, పళ్లు అన్నీ వెంట తెచ్చుకుంటారు. శివరాత్రి ఉపవాస దీక్షలో ఉంటారు. భజనలతో రాత్రంతా జాగరణ చేస్తారు. మర్నాడు భోజనాలు చేసుకొని తిరుగు ప్రయాణం అవుతారు. శివరాత్రి సందర్భంగా జనంతో కిటకిటలాడే మహేంద్రగిరులు ఆ తర్వాత బోసిపోతాయి. సాహస యాత్రికులు మాత్రం తరచూ ఇక్కడికి వస్తుంటారు. ఇలా వెళ్లాలి.. మహేంద్రగిరుల యాత్రకు సాహసంతో పాటు ఓపిక కూడా ఉండాలి. ముందుగా శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నుంచి బస్సుల్లో మందస మండలం సింగుపురం చేరుకోవాలి.

మహేంద్రగిరులకు సమీపంలో ఉన్న రైల్వే స్టేషన్ పలాస. ఇక్కడి నుంచి మందస మీదుగా సింగుపురం చేరుకోవచ్చు. బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి. సింగుపురం నుంచి వాహనాల్లో.. చొంపాపురం మీదుగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన రాజబసకు వెళ్లాలి. ఆపై కాలినడక మొదలవుతుంది. దాదాపు 28 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది.



# మమ్మీలను చూసొచ్చాం..!

**గీజా పిరమిడ్‌లో...**

గ్రేట్ పిరమిడ్‌కు రెండు ద్వారాలు ఉన్నాయి. ఒకటి ఫారో చక్రవర్తి కోసమైతే, రెండోది ప్రజలకోసమట. సందర్శకులను ఒక ద్వారం నుంచే అనుమతిస్తున్నారు. లోపలకు వెళ్లి కింగ్స్ ఛాంబర్‌ను చూశాం. దీంట్లోనే కూఫూ తనకోసం నిర్మించుకున్న సమాధి ఉంది. ప్రస్తుతం నాలుగు పిరమిడ్లను మాత్రమే సందర్శకులకు అనుమతిస్తున్నారు. ఒక్కో పిరమిడ్ వెనక మూడు చిన్న పిరమిడ్లను రాణులకోసం నిర్మించారు. అవి చూశాక దగ్గర్లోనే ఉన్న వ్యాలీ ఆఫ్ నైలులోని స్ఫింక్స్ చూడ్డానికి వెళ్లాం. మనిషి మొహం, సింహం శరీరం గల పౌరాణిక రూపమే స్ఫింక్స్. ఒక సున్నపురాతి కొండనే ఆ విధంగా మలిచారట. ఆ ముఖం ఫారో కాఫ్రాది అని చెబుతారు. దీన్ని క్రీ.పూ. 2613-2494లో నిర్మించినట్లు తెలుస్తోంది.

తరవాత మజిలీ ఈజిప్టు మ్యూజియం... అందులో 1,20,000కి పైగా పురాతన వస్తువులూ 12 మమ్మీలూ ఉన్నాయి. దీన్ని 1902లో నిర్మించారట. 2011లో ఈజిప్టులో జరిగిన తిరుగుబాటులో కొన్ని విగ్రహాలనూ రెండు మమ్మీలనూ ఆందోళనకారులు ధ్వంసం చేశారట. ఇందులో ప్రధానంగా చూడదగ్గది టూటన్‌కామెన్ మమ్మీని ఉంచిన బంగారు శవపేటిక. ఇది ప్రపంచంలోకెల్లా ఖరీదైన శవపేటికగా పేరొందింది. అప్పట్లో ఆయన ముఖానికి 14 కిలోల బంగారు తొడుగు తొడిగారు. ఆయనకోసం చేయించిన బంగారు మంచం, కుర్చీ, నగలు కూడా అక్కడ ఉన్నాయి. తరవాతిరోజు కైరోలోని ఒక మార్కెట్‌ని సందర్శించాం. ఈజిప్షియన్లలో అత్యధికులు ముస్లింలే. ముఖ్య భాష అరబ్బీ. కైరోలో చాలావరకూ ఇండ్లకు ప్లాస్టరింగ్ చేయడం తక్కువ. అక్కడ వర్షపాతం చాలా తక్కువ. దాంతో ముందు మాత్రమే చేస్తారట.



**ఆస్వాన్ నగరంలో...**

మర్నాడు ఆస్వాన్ సిటీకి బయలుదేరాం. ఆస్వాన్‌లో ఆనకట్టను 'హై డ్యామ్' అని పిలుస్తారు. ఈ నిర్మాణంవల్ల లోతట్టు ప్రాంతం ముంపునకు గురైంది. అందులో ఆస్వాన్ ఆలయం, ఫిలై ఆలయం, ఆబుసింబల్ ముఖ్యమైనవి. అయితే యునెస్కో సహకారంతో వాటిని ఎత్తైన ప్రదేశాలకు తరలించారు. ఈ చుట్టుపక్కల న్యూబియన్ అనే పురాతన తెగ ఉన్న గ్రామం కూడా ముంపునకు గురయింది. వారి భాష న్యూబియన్. దీనికి లిపి లేదు. వారికి తప్ప ఎంత ప్రయత్నించినా వేరే ఎవరూ ఆ భాష నేర్చుకోలేరని తెలిపాడు గైడ్. వాళ్లను అత్యంత ప్రాచీన ఈజిప్షియన్లుగా చెప్పవచ్చు.మరబోటులో వెళ్లి ఫిలై ఆలయాన్ని సందర్శించాం. ఇందులోని దేవత పేరు ఐసిస్. ప్రాచీన ఈజిప్షియన్లు నిర్మించిన చిట్టచివరి ఆలయం ఇదేనట. దీన్ని వాళ్లు దేవతలుగా ఆరాధించే ఓజిరిస్, ఐసిస్‌లు పుట్టిన ప్రదేశంగా విశ్వసిస్తారు. కాలక్రమంలో క్రిస్టియన్లు దీన్ని చర్చిగానూ ఉపయోగించారు. పురాతన ఈజిప్షియన్లు తాము ఆరాధించే దేవతలని మానవరూపంలో కాకుండా జంతురూపంలోనే ఎక్కువగా పూజించేవారు. అందుకే ఆలయగోడలమీద ఎద్దు, గద్ద, నక్క, మొసలి రూపంలో మలిచిన విగ్రహాలన్నీ ఆ కోవకే చెందుతాయి. నైలునదిలో ఆస్వాన్ నుంచి లక్సర్‌కు పడవలో బయలుదేరాం. దారిలో పిరమిడ్లకోసం తవ్విన గ్రానైట్ క్వారీనీ, అసంపూర్తిగా వదిలేసిన ఒబిలిస్క్‌నీ చూశాం. ప్రాచీన ఈజిప్షియన్లు ఒంటిరాయి స్తంభాలను నిర్మించి వాటిమీద రాజుల గురించి చెక్కించేవారు. నైలునది దక్షిణం నుంచి ఉత్తరానికి 6,853 కిలోమీటర్లు ప్రవహించి, రెండు పాయలుగా చీలి మధ్యధరా సముద్రంలో కలుస్తుంది. ఈజిప్టు మొత్తం నైలునది మీదే ఆధారపడి ఉందంటే అతిశయోక్తి కాదు. అందుకే అక్కడివాళ్లంతా 'నో నైల్, నో ఈజిప్ట్' అంటుంటారు. ఎక్కడో చిన్న చిన్న పాయలుగా మొదలైన నైలు నది ఈజిప్టుకే వరప్రదాయని అని చెప్పవచ్చు. పడవలో సాయంత్రం ఆరు గంటలకు కొమాంబు ఆలయానికి చేరుకున్నాం. ఈ ఆలయాన్ని మొసళ్ల దేవతకోసం నిర్మించారు. 22 మొసళ్లనూ గుడ్లనూ మమ్మీలుగా చేసి ప్రదర్శిస్తున్నారు. మర్నాడు ఉదయం నాలుగు గంటలకు ఆబుసింబల్ దర్శించడానికి బయలుదేరాం. 300 కి.మీ. దూరం సహారా ఎడారిలోనే ప్రయాణం. దారిలో ఒక్క ఊరు కూడా కనబడదు. గొప్ప ఫారో చక్రవర్తిగా పేరొందిన రామ్‌సీస్ ఖిఖి నిర్మించినదే ఆబుసింబల్ ఆలయం. ఆనకట్ట కారణంగా ముంపునకు గురవడంతో దీన్ని ఇక్కడకు తరలించారు. ఇది రెండు ఆలయాల సముదాయం. ఒకటి రామ్‌సీస్ కోసమైతే, రెండోది ఆయన భార్య నెఫెర్‌టారికోసం. ఇది ఒకటే రాతితో నిర్మించిన భారీ విగ్రహాల సముదాయం. ఆ అద్భుత శిల్పకళా సంపదను దర్శించి, తిరిగి ఓడ దగ్గరకు వచ్చేసరికి మధ్యాహ్నం రెండు గంటలయింది. అక్కడినుంచి ఓడలోనే ఎడ్ఫుకి చేరుకున్నాం. ఉదయం ఏడు గంటలకు గుర్రపుబగ్గీలో ఎడ్ఫు ఆలయానికి చేరుకున్నాం. గద్ద ముఖం, మనిషి శరీరంతో గల హోరస్ దేవతకు చెందిన ఆలయం ఇది.ఇక్కడి ఆలయాలన్నీ ముందు భాగం వెడల్పుగానూ ఎత్తుగానూ లోపలికి వెళ్లే కొద్దీ వెడల్పూ ఎత్తూ తగ్గుతూ ఉంటాయి. ఇక్కడ ఉన్న భారీ కుడ్యాలనూ స్తంభాలను చూస్తే ఔరా అనిపించక మానదు. గోడలమీద అప్పట్లోనే ఆపరేషన్లకు అవసరమైన వస్తు సామగ్రినీ కాన్పు సమయంలో తల్లిని కూర్చోబెట్టిన దృశ్యాలనూ చెక్కడం చూసి ఆశ్చర్యపోయాం. చివరి రోజు లక్సర్ పట్టణాన్ని సందర్శించాం. ఇది ఫారోల రాజధాని నగరం. ఇక్కడ ముఖ్యంగా చూడదగ్గవి నాలుగు. మార్చురీ టెంపుల్ ఆఫ్ హాట్సెప్సుట్, కార్నక్ టెంపుల్, వ్యాలీ ఆఫ్ కింగ్స్, లక్సర్ ఆలయాలు. హాట్సెప్సుట్ టెంపుల్ ఓ సూర్యదేవాలయం. ఈ ప్రదేశంలో దొరికిన శిథిలాలతో దీన్ని పునర్నిర్మించారు. ఇందులోని వర్ణచిత్రాలను చూసి ఆశ్చర్యపోవాల్సిందే. వేల సంవత్సరాలు గడిచినా ఎండకు ఎండినా రంగులు మాత్రం వెలసిపోలేదు. అక్కడి నుంచి వ్యాలీ ఆఫ్ కింగ్స్‌కు బయలుదేరాం.




**సమాధుల్లో మమ్మీలతో..!**

ఈజిప్టుని పాలించిన ఫారో చక్రవర్తులు మరణానంతర జీవితం ఉంటుందని విశ్వసించేవారు. అందుకోసమే భారీ యెత్తున పిరమిడ్లు నిర్మించుకున్నారు. క్రీ.పూ. 1069 నాటికి క్రమంగా వాటిమీద ఇష్టం తగ్గి, సమాధులు నిర్మించుకోవడం ప్రారంభించారు. పిరమిడ్‌లలో ఉంచిన మమ్మీలనూ సంపదలనూ దుండగులు కొల్లగొడుతుండటం కూడా ఒక కారణం కావచ్చు. దాంతో తమ సమాధులను భద్రంగా ఉండేందుకు ఈ వ్యాలీ ఆఫ్ కింగ్స్‌ను ఎన్నుకున్నారు. ఈ భూభాగమే సహజసిద్ధంగా ఏర్పడిన పిరమిడ్ ఆకారంలో ఉంటుంది. దాంతో తరవాతి కాలానికి చెందిన ఫారోలు తాము జీవించి ఉండగానే తమ అభిరుచికి అనుగుణంగా తమ సమాధులని ఇక్కడ తీర్చిదిద్దుకున్నారు. అలాంటివాటిల్లో టూటన్‌కామెన్ సమాధి ఒకటి. కైరో మ్యూజియంలోని మమ్మీలన్నీ ఇక్కడ బయటపడినవే. ప్రస్తుతం ఈ వ్యాలీలో కేవలం మూడింటిలోకే ప్రవేశం ఉంది. భూమిలోపలి పొరల్లో గుహలుగా తొలిచి మరీ వీటిని నిర్మించారు. అద్భుత కుడ్యచిత్రాలతో కూడిన టూటన్‌కామెన్ సమాధిలో అతని మమ్మీని సందర్శించాం. ఆ సమాధిలో అనేక వస్తువులతోబాటు బంగారు తొడుగూ టూటన్‌కామెన్ మమ్మీ బయటపడ్డాయట. మమ్మీనీ, చెక్క శవపేటికనీ ఇక్కడ సందర్శనకు ఉంచి మిగిలిన సంపదను కైరో మ్యూజియంకు తరలించారు. చివరగా లక్సర్ ఆలయానికి వెళ్లాం. ఇది 66 ఎకరాల్లో నిర్మించిన 132 భారీ స్తంభాల సముదాయం. ఇక్కడ రహదారికి ఇరువైపులా మానవశరీరం పొట్టేలు ముఖం కలిగిన విగ్రహాలున్నాయి. పిరమిడ్లతోబాటు ఈజిప్షియన్ల కళాసంపదనీ చూశామన్న తృప్తితో వెనుదిరిగాం.




**వానాకాలం విహారం మనసుకు ఆహ్లాదాన్నిస్తుంది. ప్రయాణంలో కొన్ని చికాకులు ఉన్నా.. చల్లటి వాతావరణం, పచ్చదనంతో పులకించే పుడమి, జలకళ సంతరించుకున్న నదీనదాలు ఇవన్నీ మాన్‌సూన్ పర్యాటకానికి కిక్ ఇచ్చేవే. వానకాలం ప్రయాణాల్లో ఈ జాగ్రత్తలు పాటిస్తే సాధారణ సమస్యల నుంచి సులభంగా బయటపడొచ్చు.**



# వానల్లో వెళ్తున్నారా..

వర్షాకాలం దోమల బెడద నుంచి తప్పించుకోవాలంటే రెప్పలెంట్ దగ్గరుంచుకోవాలి. రెప్పలెంట్ బాండ్స్ కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ నీళ్లు తాగడం మంచిది కాదు. మినరల్ వాటర్ తాగండి. అవకాశం ఉంటే నీటిని కాచి వడగట్టండి. రెయిన్ కోట్, గొడుగు వెంట తీసుకెళ్లండి. వర్షాకాలం విహారంలో ఎక్కువగా ఆకర్షించేవి చిరుతిళ్లు. చిరుజల్లుల వేళ.. వేడివేడిగా ఏది కనిపించినా తినకుండా ఉండలేం. శుభ్రత పాటించని ఫుడ్‌కోర్టుల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చిరుతిళ్లు తింటే.. ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. వర్షపాతం వివరాలు, పర్యటించదలచిన ప్రాంతంలో పరిస్థితులు వీటి గురించి అంతర్జాలంలో సమాచారం సేకరించి అందుకు తగ్గట్టుగా ప్రయాణ ప్రణాళిక మార్చుకోవాలి.



# ఐస్‌కేఫ్.. కెవ్వుకేక!

ప్రకృతిలో చాలా అందాలున్నాయి. అద్భుతాలున్నాయి. కొన్నింటిని మనిషి సృష్టిస్తే కొన్నింటిని మాత్రం ప్రకృతి ఇచ్చింది. అలా ప్రకృతి ఇచ్చినవి ఎప్పటికీ అద్భుతంగానే ఉంటాయి. భారతదేశంలో ఉన్న ఏకైక ఐస్‌కేఫ్ ఇది. అయితే ప్రకృతిసిద్ధంగా లడఖ్‌లో ఉద్భవించింది. సముద్రమట్టానికి 14వేల అడుగుల ఎత్తులో ఉన్నది. మనాలి -లే హైవే ఈ కేఫ్ కనిపిస్తుంది. దీన్ని మానవులు సృష్టించలేదు. సహజ ప్రకృతి ప్రక్రియ ద్వారా వెలువడింది. ఈ ఐస్‌కేఫ్ బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ అధికారులు వెలుగులోకి తీసుకొచ్చారు. ఇది లే నుంచి 75 కిలోమీటర్ల దూరం ఉన్నది. లడఖ్‌కు వచ్చే సందర్శకులను ఆకర్షించేందుకు ఈ ఐస్‌కేఫ్‌ను ప్రారంభించారు. గుహ మాదిరిగా ఉన్న దీనిలో హాట్‌డ్రింక్స్, నూడుల్స్‌వంటి ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారు.



# కొత్త ప్రదేశానికి వెళ్తే ఎక్కడ తినాలో?

ఓ పట్టాన అర్థం కాదు. మంచి హొటల్ ఎక్కడుందో తెలియదు. ఇలాంటి సమయాల్లో చాలామంది ఆన్‌లైన్ రివ్యూలపై ఆధారపడుతుంటారు. ఈ రేటింగ్స్ ఎక్కువగా పర్యాటకులే ఇస్తుంటారు. సదరు రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు వాళ్లకు ఎ దురైన అనుభవాన్ని బట్టి రివ్యూలు రాసేస్తుంటారు. అందుకే వాటిని గుడ్డిగా నమ్మేయొద్దు. ఒక ప్రాంతంలో ఉన్న రెస్టారెంట్లు, ఆహార విషయాలు స్థానికులకు తెలిసినంతగా.. చుట్టపు చూపుగా వచ్చిన పర్యాటకులకు అంతగా తెలియకపోవచ్చు. అందుకే ఆన్‌లైన్ రివ్యూలు కాకుండా.. స్థానికుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఎక్కడ తినాలో నిర్ణయించుకోవాలి. స్థానిక రుచుల గురించి ఆరా తీయాలి.. ఆరగించాలి. మరో విషయం ప్రయాణాల్లో చాలామంది స్ట్రీట్ ఫుడ్ జోలికి వెళ్లరు. అన్ని సమయాల్లోనూ ఇది సరికాదు. బడ్జెట్‌లో వేడివేడి రుచులు కావాలన్నా.. ఆ ప్రాంతానికే ప్రత్యేకమైన రుచులు ఆస్వాదించాలన్నా స్ట్రీట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లాలి. అక్కడ రుచికరమైన ఆహారం దొరుకుతుందో లేదో తెలుసుకోవడం కూడా సులభమే! సాధారణంగా స్ట్రీట్‌ఫుడ్ సెంటర్స్‌కు స్థానికులే ఎక్కువగా వెళ్తుంటారు. ఎక్కడ రద్దీగా ఉంటుందో.. అక్కడికి వెళ్లి ఓ పట్టు పట్టేయడమే. రుచి బాగుంటేనే కదా రద్దీ ఎక్కువగా ఉండేది!

# శనీశ్వరుడి ప్రత్యేకతలు



హిందూ సంస్కృతీ, సంప్రదాయాలలో శనిగ్రహానికి విశిష్టమైన ప్రాధాన్యత వుంది. కాలమానప్రకారం చంద్రడు పక్షంలోని పదమూడవ రోజును త్రయోదశి అని అంటారు. ఇది సంవత్సరంలో పన్నెండుసార్లు వస్తుంది. ఇందులో కొన్నింటికి హిందూ ధర్మంలో ప్రత్యేక విశిష్టత వుంది. శనికి త్రయోదశి అంటే చాలా ఇష్టం. అందుకే శనివారంనాడే శనిగ్రహానికి పూజలు నిర్వహిస్తారు. ఏ త్రయోదశి అయితే శనివారంరోజు సంభవిస్తుందో.. ఆరోజున శని విగ్రహాన్ని "శనీశ్వరుడి"గా పిలుచుకుంటారు. ఇటువంటి సమయంలో శని మానవులు కోరుకున్న యోగాలను అందించి, మూడు దోషాలను దూరం చేస్తాడని ప్రజలు విశ్వసిస్తారు. మొత్తం నవగ్రహాలకు ఈ శనీశ్వరుడు అధిపతి. పురాణాలప్రకారం త్రయోదశినాడు శనైశ్చరుని భక్తితో ఆరాధించిన వారికి ఎటువంటి అవాంతరాలు కలగుండా.. వారికి శుభం జరుగుతుందని తెలిపి వుంది. భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 24 గంటలు పడుతుంది. అదే శనిగ్రహం సూర్యుని చుట్టూ తిరగడానికి ఏకంగా 30 సంవత్సరాల కాలం పడుతుంది. అందుకే శనిగ్రమాన్ని "మందుడు" అని మహర్షులు పేరు పెట్టారు. అంతేకాదు... శనిగ్రహుడు జీవరాసులను సత్యమార్గంలో నడిపించడానికి అవతరించాడని కూడా వారు పేర్కొంటున్నారు. సాధారణంగా చాలామంది శని పేరు వినగానే అందరూ భయపడిపోతారు. ఆందోళనలకు గురి అవుతుంటారు. అయితే ఆయన్ని భక్తితో శ్రద్ధగా కొలిస్తే.. సకలఐశ్వర్యాలతోపాటు శుభాలను ప్రసాదిస్తాడని నమ్ముతారు. శనివారం – త్రియోదశినాడు నల్లటి దుస్తులు ధరించి, శనిస్వామికి నువ్వులనూనెతో అభిషేకం చేయిస్తే సంతోషిస్తాడని భక్తులు నమ్ముతుంటారు. మందపల్లి మందుడు :తూర్పుగోదావరి జిల్లాలోని కొత్తపేట మండలంలో మందపల్లి అనే గ్రామం వుంది. ఈ గ్రామంలోనే ప్రాచీనమైన శనీశ్వరాలయం వుంది. ఈ ఆలయానికి దగ్గరలోనే ధండిచి మహర్షి ఆలయం కూడా వుంది. పురాణాల ప్రకారం.. ధండిచి మహర్షి అసురులను చంపడానికి ఇంద్రుడికి తన వెన్నుముకను దానంగా ఇచ్చాడు. మందపల్లి శనీశ్వర స్వామి ఇతర ఆలయాలకు కాస్తంత భిన్నం. శత్రు, రోగ, రుణ బాధల నుంచి విముక్తి కోసం వేలాదిమంది భక్తులు వస్తుంటారు. జాతక చక్రంలో శనితో సమస్యలున్నవారు కూడా వస్తుంటారు. పూర్వం అశ్వత్థ్, పిప్పలాదులనే రాక్షసులు ఈ ప్రాంతంలో తపస్సు చేసుకునే మునులను సంహరించి వారిని భక్షించేవారట. అప్పుడు వారంతా వెళ్లి అక్కడే పరమేశ్వరుని తపస్సులో ఉన్న శనీశ్వరునితో మొరపెట్టుకున్నారట. వారి ఆవేదనలను విన్న శనీశ్వరుడు ఆ రాక్షసులను హతమార్చాడు. అసుర సంహారం వల్ల కలిగిన బ్రహ్మహత్యాపాతకాన్ని నివారించుకునేందుకు మందపల్లిలో శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశాడట. అప్పట్నుంచి ఆ ఆలయం శన్యైశ్చర క్షేత్రంగా పేరుపొందింది. అర్ధాష్టమశనితోనూ బాధపడేవారు ఈ స్వామికి తైలాభిషేకం జరిపిస్తే అవన్నీ తొలగిపోతాయని ప్రతీతి. ఇటీవలే కర్ణాటకలోని ఉడుపిలో దేశంలోనే అతిపెద్దద్నైన శనీశ్వరుడి విగ్రహాన్ని (23 అడుగులు) ఆవిష్కరించారు.



## వ్యతిరేకతల నివారణకు క్రీం బగళాయై నమః

పీతాంబరాం తాం ద్విభుజాం త్రినేత్రాం గాత్రగోజ్జ్వలా శిలా ముద్గర హస్తాం చ స్మరేత్తాం బగళాముఖీమ్"జిహ్వాగ్రమాదాయ కరేణ దేవీం వామేన శత్రూన్ పరిపీడయంతీం గదాభిఘాతేన చ దక్షిణేన పీతాంబరాఢ్యాం ద్విభుజాం భజామి"మన చుట్టూ ఉండే ప్రకృతికి సంబంధించిన ఎండ, వాన, చలి వంటి ప్రతికూలతలను తట్టుకోవడానికి మనం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాం. సాధారణంగా మనం తట్టుకునే శక్తి ఉన్నంత వరకు ఏ అంశమైనా ప్రతికూలత కాదు. మన శరీరం, మనస్సులు తట్టుకోలేనప్పుడు మాత్రమే దానిని 'ప్రతికూలత' అంటాం. ఇవి మన చుట్టూ వుండే వ్యక్తులలో, వాతావరణంలోనే కాకుండా మనలో కామ క్రోధాదుల రూపంలోనూ ఉండవచ్చు. మనలోనూ, మనతోనూ వుండే విరోధుల, వ్యతిరేకతలను మనం నిత్యం అధిగమిస్తుండాల్సి వస్తుంది. అదే విధంగా మాత్సర్యం, ఈర్ష్యాది గుణాలవల్ల మనం పొందే సుఖసంతోషాలు మనం పొందలేకుండా పోయే అవకాశం ఉంది. వాటిని మళ్లీ సాధించుకుంటూ ఉండాలి. మన మనస్పైనా, ఇతరులైనా అనవ సరంగా మాట్లాడటం వల్ల వచ్చే సమస్యలను అధిగమించడానికి కూడా మనం ప్రయత్నిస్తూ ఉండాలి. మానవ మాత్రమైన ప్రయత్నాలన్నీ ఒక స్థాయి దాటిన తర్వాత పనికిరావు. అవతలి వారి వ్యతిరేకతల స్థితి తీవ్రంగా ఉంటున్నప్పుడు మనం శక్తిపైన ఆధారపడక తప్పదు. ఆ శక్తులు అనేక రూపాలలో ఉన్నప్పటికీ వ్యతిరేకతలను నివారించగలిగే ప్రత్యేక శక్తి కలిగిన అమ్మవారు 'బగళాముఖీ దేవి'. ఈ అమ్మవారి స్తోత్రాదులు శ్రద్ధతో ప్రతిరోజూ కదలకుండా కూర్చుని నియమబద్ధంగా పఠిస్తే మనలో, మనతో వున్న వ్యతిరేక ప్రభావాలు పోతాయి. మన మాటకు విలువ పెరుగుతుంది. వాక్కును నియమించే శక్తికూడా వస్తుంది. మనం తట్టుకోలేని వ్యతిరేకతలు మనకు వస్తున్న సందర్భంలో మనం ఈ అమ్మవారిని ప్రతిరోజూ ఒక గంటసేపు నియమబద్ధంగా ప్రార్థించడం వల్ల మేలు కలుగుతుంది. 'క్రీం బగళాయై నమః' అనే మంత్రాన్ని అవసరానుకూలంగా, శ్రద్ధాభక్తులతో జపిస్తే మన చుట్టూ అనవసరంగా మాట్లాడేవారు దూరమవుతారు. మన మాటకు, చేష్టకుకూడా ప్రత్యేక శక్తి ఏర్పడుతుంది. ధర్మబద్ధమైన మన జీవన యానానికి అనుకూలతలు ఏర్పడి, కాలం సుగమం అవుతుంది.

## హడావుడిగా స్నానం చేయడం సరైంది కాదు!



ప్రస్తుత ఆధునిక యుగంలో ప్రతిఒక్కరికి స్నానం ఎలా చేయాలోనన్న విషయం అస్సలు తెలియదు. హడావుడిగా బాత్‌రూమ్‌లోకి వెళ్లడం, అలా నాలుగు మగ్గులు ఒంటి మీద నీళ్లు చల్లుకుని స్నానం అయ్యిందనిపించుకుని పనులకు బయలుదేరడం.. ఇలా చాలామంది చేస్తుంటారు. మరికొంత మంది అసలు మొత్తం శరీరం తడవకుండానే స్నానం అయిపోయిందనిపిస్తుంటారు. అయితే.. ఈ విధంగా స్నానం ఆచరించడం ఏమాత్రం సరైంది కాదని జ్యోతిష్య నిపుణులు చెబుతున్నారు. స్నానం ఆచరించుటకు సరైన విధి వుంది. దాని ప్రకారం నడుచుకుంటేనే స్నానం ఆచరించినట్లవుతుంది. దీని గురించి తెలుసుకోవడం కంటే.. మరో విషయాన్ని తెలుసుకోవాల్సి వుంది. స్నానాలు పలురకాలుగా వుంటాయి. అవేమిటంటే.. సముద్రస్నానం : స్నానాలన్నింటిలో ఇది ఎంతో శ్రేష్టమైంది. ఎందుకంటే ఆ నీటిలో ఉప్పు ఉంటుంది. ఉప్పు వలన శరీరంలోని మలినాలు పూర్తిగా నశించి.. శుభ్రం అవుతారు. అప్పుడు ఎంతో హాయిగా అనుభూతి పొందుతారు. నదీ స్నానం : సముద్ర స్నానం తర్వాత ఉత్తమమైంది నదీ స్నానం. ఉదయాన్నే నదీ స్నానం చేయటం వలన చర్మరోగాలు దరిచేరవు. నదులు కొండలూ, కోనలు, చెట్లూ అడవుల గుండా ప్రవహించడం వలన వాటిలో ఎన్నోఔషధ విలువలు చేరుతాయి. అందకే నదీ స్నానం ఆరోగ్యదాయకం అని చెప్తారు. పుష్కర స్నానం : పుష్కర సమయంలో స్నానం చేయడం వలన స్త్రీ, పురుషుల చేత పుట్టినప్పటి నుంచీ చేయబడిన పాపం తొలిగిపోతుంది అని నమ్మకం. ఆ సమయంలో మనమే కాదు, ముక్కోటి దేవతలు నదిలో స్నానం ఆచరించి తరిస్తారని భక్తుల విశ్వాసం.

ఇంట్లో స్నానం : పుష్కరస్నానం తర్వాత వచ్చేది ఇంట్లో చేసే స్నానం. ఎక్కువ వేడిగానీ, బాగా చల్లగా ఉన్న నీటితో గానీ స్నానం చేయకూడదు. గోరువెచ్చటి నీటితో స్నానం చేయటం వలన శరీరానికి హాయి చేకూరుతుంది. రోగులు, చిన్నపిల్లలు దీనికి మినహాయింపు. హడావుడిగా కాకుండా ఒక పద్ధతిలో స్నానం ఆచరించాల్సి వుంటుంది. స్నానం చేయటం అనేది ఒక విధి మాత్రమే అనుకుని ముగించుట కన్నా అది ఒక భోగంలా సంతృప్తిగా అనుభవించుట నేర్చుకోవాలి. అందుకే ఆనాడు స్నానఘట్టాలు, స్నాన గదులకు మన వారు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చి వుంటారు.

## ఇచ్చేది, ఇప్పించేదీ భగవంతుడే!



పూజలు, వ్రతాలు, నోములు, దానాలు వంటి పుణ్యకార్యాలు ఏవి చేసినా కర్త ఏదో ఫలాన్ని ఆశించడం సర్వసాధారణం. కోర్కెలు లేకుండా ఎవ్వరూ సాధారణంగా పుణ్యకార్యాలు చేయరు. ఎవరైనా నిష్కామంగా అవి చేస్తున్నారంటే నిజంగానే వాళ్లు 'భగవద్విజ్ఞానం' పూర్తిగా అర్థమైనవారని తెలుసుకోవాలి. అటువంటివారు చాలా అరుదు. కోర్కెల కోసం పూజా వ్రతాదులు చేసేవారికి తాము పూజిస్తున్నది దేవతలనో, భగవంతుడినో కూడా తెలియని స్థితి ఉంటుందంటే పొరపాటు కాదు. 'ఎవరిని పూజించినా ఆ పరమేశ్వరునికే చేరుతుంది. అందరూ ఒక్కటే. అన్ని మార్గాలూ చివరికి మనలను చేర్చేది ఒకే గమ్యానికి..' ఇటువంటి మాటలు ఈ విషయాన్నే నిరూపిస్తాయి. 'భగవద్గీత'లో శ్రీకృష్ణ భగవానుడు 'దేవాన్ దేవయజో యాన్తి మద్భక్తా యాన్తి మామపి' (7–23) అన్న అసలు రహస్యం చెప్పారు. అంటే, 'దేవతలను పూజించేవారు దేవతాలోకాలకు వెళతారు. కానీ, నా భక్తులు నాదైన పరమలోకానికి చేరుకుంటారు' అన్నారాయన. 'అల్పబుద్ధి కలిగిన మానవులే దేవతలను పూజిస్తారు. కానీ, ఆ దేవతలు ఇచ్చే ఫలాలు పరిమితమైనవి, తాత్కాలికమైనవి' అన్న పలుకులు స్వయాన ఆ దేవదేవునివే అంటే మనందరం తప్పక విశ్వసించాలి.

'దేవతారాధకులది అల్పబుద్ధి' అని శ్రీకృష్ణుడు ఎందుకన్నట్టు? నానారకాల దేవతలను పూజించేవారంతా ఎంతో శ్రద్ధతో, ఏకాగ్రతతో, తపస్సుతోనే తమలోని భక్తిని చాటుతుంటారు. దృఢదీక్షలూ చేపడుతుంటారు. వారి భక్తికి, ఉపాసనకు తగ్గట్లుగానే కోర్కెలు సైతం తీరుతూనే ఉంటాయి. దానితో ఆ దేవతల పట్ల వారిలోని శ్రద్ధ మరింత పెరుగుతుంది. కానీ, ఇక్కడ మనం గ్రహించవలసిన సత్యమొకటున్నది. దానినే శ్రీకృష్ణ భగవానుడు వెల్లడించాడు.'ఎవరేని ఒకానొక దేవతను పూజించగోరగానే నేనే వారి శ్రద్ధను సుస్థిర పరుస్తాను. అలా వారు ఆ దేవతకు అంకితమయ్యేటట్లు చేస్తాను (7–21)'. 'ఇంతటి శ్రద్ధతో వారు ఒక ప్రత్యేకమైన దేవతను పూజించి తమ కోర్కెలను ఈడేర్చుకుంటారు. కానీ, నిజానికి ఆ వరాలన్నీ కేవలం నా ద్వారానే ఇవ్వబడతాయి (7–22)'. చాలామంది ఈ వాస్తవాన్ని తెలుసుకోలేకపోతున్నారు. అందుకే, వారిని 'అల్పబుద్ధి పరులు'గా దేవదేవుడు 'భగవద్గీత'లో అభివర్ణించాడు. పిల్లలు అమ్మను డబ్బు అడిగితే 'నాన్న ఇచ్చిన డబ్బునే' ఆమె వారికిచ్చినట్టు. ఇదీ అలాంటిదే. తనకు 'అమ్మనే డబ్బు ఇస్తున్నదన్న' అమాయకత్వం ఆ పిల్లలది. కానీ, ఎప్పుడైతే వారు జ్ఞానవంతులవుతారో అప్పుడు నాన్నకు అధీనులవుతారు. నాన్న నుంచే నేరుగా అన్నీ పొందుతారు. అయినా, ఆ వేళలోనూ అమ్మపట్ల అనురాగంతో, గౌరవంతోనే ఆ పెరిగిన పిల్లలుంటారు. (ఈ రోజుల్లో ఆడవారూ సంపాదిస్తున్నారు అదే వేరే విషయం). అనేకమంది భక్తుల నైజం ఇలానే ఉంటుంది. వారు అందరు దేవతలను ఆరాధించినా పూజించేది భగవంతుడినే. భగవంతుడు– దేవతల సంబంధం గురించిన ఈ విషయాన్ని తెలుసుకోగలగడమే ఇక్కడ ముఖ్యం. ఫలితంగా మనలోని అల్పబుద్ధిని అధిగమించవచ్చు.

నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానాం
ఏకో బహూనాం యో విదధాతి కామాన్

– కఠోపనిషత్ (2.2.13)

జీవులందరు నిత్యులే. వారిలో మానవులు, దేవతలు కూడా వస్తారు. వారంతా చైతన్యపూర్ణులే. అయితే, నిత్యులలో పరమనిత్యుడు, చైతన్యులలో పరమ చైతన్యపూర్ణుడు భగవంతుడే. ఆతడు మాత్రం ఒక్కడే. మిగిలినవారంతా అనంతసంఖ్యలో ఉంటారు. ఆ ఒక్క భగవంతుడే మిగిలిన అందరి అభీష్టాల (కోరికలు)ను తీరుస్తుంటాడు. నిజానికి సర్వుల సకల అభీష్టాలను తీర్చేది, తీర్చగలిగేది దేవదేవుడైన భగవంతుడు మాత్రమే. ఆయన ఇచ్చిన వాటినే దేవతలు తమ చేతుల మీదుగా భక్తులకు ఇస్తుంటారు. ఇటువంటి 'పరమాద్భుత కర్మలు' చేసే భగవంతుడిని తెలుసుకోవాలంటే 'భగవద్గీత'ను ఆశ్రయించవలసిందే. అప్పుడు 'భగవద్విజ్ఞానం'తో కూడిన భగవదాశ్రయం మనకు లభిస్తుంది. ఫలితంగా ఇహపరాలలో సమస్తాభీష్టాలూ నెరవేరుతాయి.

## హరే రామ హరే రామ- రామ రామ హరే హరే ?



'బ్రహ్మాండ పురాణం'లోని ఈ 'మహామంత్రం'తో కూడిన బృహత్ 'జపయజ్ఞం'లో భక్తులు అధికసంఖ్యలో భాగస్వాములు కావాల్సిందిగా ఒడిశా జగన్నాథపురి స్వామి చిన్మయ కృష్ణదాస ఇటీవల పిలుపు నిచ్చారు. ఈ మంత్రం గొప్పతనం పై పురాణంలో ఎంతో వివరంగా ఉన్నట్టు ఆయన చెప్పారు. '1000 విష్ణు నామాలూ 1 రామ నామం, 3 రామ నామాలూ 1 కృష్ణనామం. ఈ 'మహామంత్రం'లో కృష్ణుని నామం 4 మార్లు వుంది. కనుక, 4 కృష్ణ నామాలూ 12 రామ నామాలు. అలాగే, ఇందులో రామ నామం కూడా 4 మార్లు వున్నందున, 12ంశా 16 రామ నామాలూ 1 'మహామంత్రం'. ఒక రామ నామం వెయ్యి విష్ణు నామాలకు సమానం కాబట్టి, 16 రామ నామాలూ 16,000 విష్ణు నామాలు. ఈ లెక్కన, 1 మాల (108 పూసలూ 16,000 %ఇ% 108ా 17,28,000 విష్ణు నామాలు. 16 మాలలూ 17,28,000%ఇ% 16ా 2,76,48,000 విష్ణు నామాలు.'మంత్రాలన్నిటిలోకీ రాజువంటిది ఈ మహామంత్రం. అందువల్లే, కలియుగంలో మానవులకు మోక్షాన్ని చేకూర్చే అత్యంత శక్తివంతమైన మంత్రంగా దీనినే శాస్త్రాలు పేర్కొన్నాయి' అని కృష్ణదాస తెలిపారు. ఈ జపయజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, ఎవరికి వారు తమ శక్తి కొలది 'హరే కృష్ణ' మంత్రాన్ని జపించాలని ఆయన చెప్పారు. 'ప్రతి రోజూ కనీసం 10 నిమిషాలపాటు మంత్రాన్ని జపించవలసిందిగా ఆయన సూచించారు. 2021 ఏప్రిల్ 21 శ్రీరామనవమి వరకు అంతా కలిసి 108 కోట్లమేర జపయజ్ఞంలో భాగస్వాములను చేసేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ జపయజ్ఞంలో పాల్గొనాలను కొనేవారు తత్సంబంధ 'జప క్లబ్' గ్రూప్‌లో చేరవలసి వుంటుంది. ఈ జప ప్రభావం వల్ల కరోనా మహమ్మారి నుంచి విముక్తి మనకు లభించగలదని కూడా కృష్ణదాస విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచంలోని ఎక్కడివారైనా ఈ జపయజ్ఞం బృందంలో చేరవచ్చు. వాట్సాప్ నంబర్: 89197 17982. లింక్స్: ,

## కర్మ ఫలితమే అదృష్టం

"మనం జీవితంలో ఆచరించే కర్మను బట్టే మన అదృష్టం ఆధారపడి ఉంటుంది. ఇదే జీవిత రహస్యం. అందుకే ఎవరి అదృష్టం వారి చేతల ద్వారానే నిర్ణయించబడుతుంది కానీ మరేది కాదు" అంటారు మహాత్మా కబీరు. శక్తి వంచన లేకుండా చేసే కృషి వల్లే అదృష్టం కలుగుతుందనేది కబీరు అభిప్రాయం. కష్టేఫలే, కృషితో నాస్తి దుర్భిక్షం అని మన పెద్దలు చెప్పిందీ ఇదే. మనిషి జీవితం ఎన్నెన్నో మలుపులు తిరుగుతుంటుంది. ప్రతి మలుపూ ఏదో ఒక ప్రభావాన్ని చూపుతుంది. మనం చేసే మంచి పనులు మన అదృష్టాన్ని నిర్ణయిస్తాయని కొందరంటే మనం గతంలో చేసుకున్న దాన్ని బట్టే ఈ స్థితి అని మరికొందరంటారు. విష్ణుమూర్తి ఈ భూమ్మీద రామునిగా అవతరించి.. తనకు ఎదురైన కష్టాలను సహనంతో ఎదుర్కొని, నిరంతరం సత్కర్మలను ఆచరించి పురుషోత్తముడయ్యాడు. శ్రీకృష్ణుడు కూడా.. అదృష్టం కోసం ముక్కుమూసుకుని తపస్సు చేయాలని చెప్పలేదు. పూజలు, వ్రతాలు, ఉపవాసాలు చేయాలని బోధించలేదు. సంసారం దుఃఖసాగరమని నిరాశపడకుండా మనిషి సహజ స్వభావమైన కర్మ చేయాలని, ఆ చేసేదేదో మంచి కర్మ చేయాలని అర్జునికి బోధిస్తాడు. అంటే మంచి పనులే మనిషికి అదృష్టాన్ని తెచ్చిపెడుతూ మనిషి సుఖసంతోషాలతో జీవించే అవకాశం కల్పిస్తుందని పరమాత్ముని బోధనసారం. "మనిషి నిస్వార్థంతో చేసే మంచి పనుల వల్లే మంచి ఫలితం సిద్ధిస్తుంది. సిద్ధాంతాలు, మతాచారాలకు అతీతంగా.. అనుక్షణం స్వార్థ రహితమైన కర్మను ఆచరించడమే ప్రతి మనిషి పరమావధి. అలా చేయడంవల్ల ఒనగూరే ఫలితాలెన్నో!" అన్నారు స్వామి వివేకానంద. ఒక్కొక్కప్పుడు మంచి పనులతో మనిషి కష్టాలెదుర్కొనే పరిస్థితి రావచ్చు. అలాంటి సందర్భాల్లో ధైర్యంగా వాటిని ఎదుర్కొంటే అంతిమంగా మంచి ఫలితమే లభిస్తుంది.

సత్య హరిశ్చంద్రుడు తాను ఇచ్చిన మాటను నెరవేర్చడం కోసంఅష్టకష్టాలను భరించడమే గాక, భార్యాబిడ్డలను సైతం అమ్ముకున్నాడు. తాను కాటికాపరిగా మారాడు. ఎన్ని కష్టాలెదురైనా.. సత్యాన్ని విడువకుండా ప్రయత్నించి భగవత్ సాక్షాత్కారాన్ని పొందాడు. అదీ సత్కర్మల శక్తి.

# పంటల బీమా.. అన్నదాతకు ఉంటుందా ధీమా..!

ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగినప్పుడు రైతుల్ని ఆర్థికంగా ఆదుకోవడానికి పంటల బీమాపథకాన్ని ప్రవేశపెట్టారు. 2019 ఖరీఫ్ నుంచి డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చారు. ఇది ఏపీ వరకు మాత్రమే పరిమితం. పంటల బీమా పథకానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. ఉచిత పంటల బీమా రైతుల్లో ధీమా పెంచింది. రాష్ట్రంలో సాగు చేస్తున్న ప్రధాన పంటలన్నింటికీ ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించింది.రుణాలు తీసుకునే రైతులైనా, తీసుకోని వారైనా పంటల బీమా కింద ఒక రూపాయి చెల్లించి తాము పండిరచే పంటను బీమా చెల్లించుకోవచ్చు. రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామీణ వ్యవసాయ సహాయకుడు ఇ-పంటను నమోదు చేసే సమయంలోనే రైతు తన పేరును నమోదు చేయించుకోవచ్చు. దీంతో రైతులు పెద్దఎత్తున తమ పంటల్ని బీమా చేయించుకుంటున్నారు. 2018తో పోల్చుకుంటే 2021 బీమా చేయించుకున్న రైతుల సంఖ్య రెట్టింపు అయింది. 2018లో 16.69 లక్షల మందిగా ఉన్న రైతుల సంఖ్య ఇప్పుడు సుమారు 35 లక్షలు దాటినట్టు వ్యవసాయ శాఖ అంచనా. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడానికి నెల ముందు ప్రభుత్వం పంటల బీమా ప్రకటన ఇస్తుంది. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైనందున రైతులు విధిగా పంటల బీమా చేయించుకోవాలని విజ్ఞప్తి చేసింది.ఇ-పంటలో నమోదు చేసుకోవడం అనివార్యం. రైతు భరోసా కేంద్రాల్లో చేయించుకోవాలి.

దీనికి ఆధార్ కార్డు కావాలి. సాగుదారుడి వివరాలు కావాలి. నోటిఫైడ్ ప్రాంతంలో నోటిఫై చేసిన వ్యవసాయ, ఉద్యాన పంటలకు మాత్రమే పంటల బీమా వర్తిస్తుంది. సాగుదారులందరూ గ్రామ సచివాలయంలోని వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏ, వీఆర్వో ద్వారా ఇ-పంటలో తమ పంటల్ని నమోదు చేయించుకోవాలి. కచ్చితమైన సమాచారం కోసం, ఏ పంటను సాగు చేశారో, ఎంత చేశారో తెలుసుకోవడానికి ఇది కచ్చితంగా ఉండాలని వ్యవసాయ శాఖ ప్రకటించింది. ఉచిత పంటల బీమా అమలుతో బీమా చేయించుకునే విస్తీర్ణం కూడా పెరిగింది. 2018 లో 18.57 లక్షల హెక్టార్లుగా ఉన్న బీమా విస్తీర్ణం 2019 నాటికి 30.98 లక్షల హెక్టార్లకు చేరింది.

అంటే దాదాపు 168 శాతానికి పైగా పెరిగింది. 2021లో సుమారు 35 లక్షల హెక్టార్లకుపైగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసే పంటలకు విడివిడిగా నోటిఫికేషన్లు ఉంటాయి. పంటల బీమా బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే స్వీకరించి వ్యవసాయ శాఖను నోడల్ డిపార్ట్మెంట్‌గా నియమించింది.దిగుబడి ఆధారంగా గుర్తించిన పంటలు (2021-2022లో) వరి, జొన్న, సజ్జ, రాగి, మొక్కజొన్న, మినుము, పెసర, కంది, వేరుశనగ (ర్షాధారం, వర్షాధారితం కానిది), పొద్దు తిరుగుడు, ఆముదం, చెరకు, పత్తి, మిరప, పసుపు, కొర్ర, ఉల్లి వాతావరణం ఆధారంగా గుర్తించిన పంటలు- పత్తి, అరటి, పసుపు, ఎర్ర మిరప, దానిమ్మ, వేరుశనగ, టమాటా, బత్తాయి, దాక్ష.

**రెండు రకాల బీమాలు..**

రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా, పునర్ వ్యవస్థీకరించిన వాతావారణ ఆధారిత పంటల బీమా పథకాన్ని సవరించి రాష్ట్ర ప్రభుత్వం వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ పథకంగా అమలు చేస్తోంది.

**రెండు రకాల బీమాలు దిగుబడి ఆధారిత, వాతావరణ బీమాలు అమల్లో ఉన్నాయి..**

జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే (జీసీఇఎస్) నిబంధనల ప్రకారం దిగుబడి ఆధారిత పంటల బీమా క్లెయిమ్స్‌ను, వాతావరణ ఆధారిత బీమా క్లెయిమ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేసే వాతావరణ డేటా ప్రకారం పరిష్కరిస్తారు. క్లెయిమ్స్ పరిష్కారానికి బీమా కంపెనీలపై ఆధార పడకుండా త్వరితగతిన పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. పంట కోత ప్రయోగాలతో నిర్ధారణ- పంట కోత ప్రయోగాల ద్వారా వచ్చే దిగుబడి ఆధారంగా పంట నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లిస్తారు. అకాల వర్షాలు, తుపానులు, వడగండ్ల వానల వల్ల జరిగే పంట నష్టాలకు, పంట కోసిన తర్వాత 14 రోజుల లోపు పొలంలో ఆరబెట్టిన పంటకు అంటే పనల మీద లేదా చిన్న చిన్న కట్టలుగా కళ్లాల్లో ఉన్నప్పుడు పంట నష్టం జరిగితే 72 గంటల్లోపల రైతువారి నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారాన్ని రైతు ఖాతాకు జమ చేస్తారు.

**వాతావరణ ఆధారిత పంటల బీమా:..**

ఈ పథకంలో వాతావరణ అంశాలైన వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి, తేమ వాటిల్లో హెచ్చుతగ్గుల ఆధారంగా అమలు చేస్తారు. ప్రతి జిల్లాలో సాగు విస్తీర్ణం ఆధారంగా గుర్తించిన పంటలకు మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని అమలు చేస్తారు. ఏపీ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ వారి వాతావరణ నివేదికను పరిగణలోకి తీసుకుని నష్టాన్ని అంచనా వేస్తారు. రైతుల సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 155251 నెంబర్‌కు ఉచితంగా ఫోన్ చేసి కనుక్కోవచ్చు. పంట కోత ప్రయోగాలు జనవరిలో పూర్తి అయిన వెంటనే ఫిబ్రవరిలో ప్రణాళిక శాఖ నుంచి నివేదికలు తీసుకుని మార్చి లేదా ఏప్రియల్ నెలలో బీమా పరిహారం నేరుగా ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు చెల్లిస్తారు.

పశువుల బీమా కోసం జగనన్న జీవక్రాంతి, పశుక్రాంతి, పశువుల బీమా పథకం అమల్లో ఉన్నాయి. గతంలో ఎకరానికి వరికి రూ. 7, 8 వందలు కట్టాల్సి వచ్చేది. ఇప్పుడది కేవలం ఒక్క రూపాయికే.. రైతులు పూర్తిగా ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలి. ఒక పంట పోతే మరోపంట పండిరచుకోవడానికి ఈ పథకం బాగా ఉపయోగపడుతుంది.

**రాష్ట్రంలో ప్రతి రైతునూ బీమా పరిధిలోకి తేవాలన్నదే లక్ష్యం**

రాష్ట్రంలో సాగుదార్లందర్నీ ఉచిత పంటల బీమా పరిధిలోకి తేవాలన్నది లక్ష్యమని వ్యవసాయ శాఖ కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్ చెప్పారు. ఏదైనా నష్టం జరిగినప్పుడు ఎటువంటి జాప్యం లేకుండా పరిహారానికి సంబంధించిన క్లెయిమ్స్‌ను పరిష్కరిస్తాం. దీనివల్ల రైతులు ఒక పంట నష్టపోతే తర్వాత పంట వేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

**ఈ పథకం సక్సెస్ కావాలంటే ఏమి చేయాలి**

ఈ పథకంపై పూర్తి అవగాహన కల్పించాలి. చాలా మంది రైతులకు ఉచిత పంటల బీమా పథకం ఉందని తెలియదు. కొందరికి అవగాహన ఉన్నా ఇది వచ్చేదా, చచ్చేదా అనే ధోరణిలో రైతులుంటున్నారు. అందువల్ల అధికారులు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలి.

ఇ-పంటలో నమోదు చేసే రోజే రూపాయి కట్టించుకుని బీమా చేయాలి. గ్రామ వ్యవసాయాధికారికి ఆయా గ్రామాల్లో ఉండే వాస్తవసాగుదెవరో తెలుసుగనుక ఆ ధృవపత్రాలు, ఈ ధృవపత్రాలంటూ చికాకు పెట్టకుండా నమోదు చేయాలి. పంట నష్టం అంచనా వేయడానికి ఎక్కువ సమయం తీసుకోకుండా తక్షణమే ఇ-పంట ఆధారంగా నష్టాన్ని లెక్కించి రైతుల్ని ఆదుకోవాలి. నష్టపరిహారం, మదింపు హేతుబద్ధంగా ఉండాలి. నష్టం అంచనాకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

**రైతుల కోసం ఏపీ ప్రభుత్వం చేపట్టిన పథకాల్లో కొన్ని..**



1. రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతు కుటుంబాలు (26-11-2019 నాటికి) 45,82,505
. వీరిలో భూమి ఉన్న రైతు కుటుంబాలు : 44,57,732
. భూమి లేని కౌలు రైతు కుటుంబాలు : 1,24,773
. ఇప్పటి వరకు పంపిణీ చేసిన మొత్తం : రూ. 5,230.24 కోట్లు
. త్వరలో లబ్ధి పొందనున్న రైతు కుటుంబాలు : 2,14,538
2. ధరల స్థిరీకరణ నిధి : రూ. 3 వేల కోట్లు
3. ప్రకృతి విపత్తుల నిధి : రూ. 4 వేల కోట్లు (ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 వేల కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ. 2 వేల కోట్లు)
4. ముఖ్యమంత్రి అధ్యక్షతన అగ్రిమిషన్ ఏర్పాటు
5. ఆయిల్ ఫాం రైతుల గిట్టుబాటు ధరకు కేటాయించిన మొత్తం: రూ. 85 కోట్లు
6. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవోల) సంఖ్య పెంపు: 171 నుంచి 271కి పెంపు
7. 45 వేల టన్నుల అరటి, 2 వేల టన్నుల మామిడి ఎగుమతి లక్ష్యం
8. బిందు సేద్యాన్ని 2.04 లక్షల హెక్టార్లకు పెంపు
9. రూ. 200 కోట్లతో ప్రతి నియోజకవర్గంలో విత్తన, ఎరువుల పరీక్షా కేంద్రాలు
10. తెగుళ్ల బారినపడ్డ కొబ్బరి చెట్ల తొలగింపునకు చెట్టుకు రూ. 1,000 సాయం
11. సరుగుడు, సుబాబుల్, జామాయిల్ రైతులకు సాయం
12. రైతు దినోత్సవంగా వైఎస్ జయంతి (జూలై -8)
13. కౌలు రైతుల కోసం ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారు హక్కుల బిల్లు-2019
14. ఉచిత పంటల బీమా పథకానికి రూ. 2,163 కోట్లు
15. ఆక్వా రైతులకు రూ. 1.50కే యూనిట్ విద్యుత్, 17 లక్షలకూ పైగా రైతులకు లబ్ధి
16. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబానికి రూ. 7 లక్షల సాయం
17. రైతులకు వడ్డీ లేని రుణాల పథకం
18. వ్యవసాయ ట్రాక్టర్లకు రోడ్డు ట్యాక్స్ రద్దు
19. శనగ రైతులకు క్వింటాల్‌కు రూ. 15 వందల చొప్పున మార్కెట్ వ్యత్యాస ధర చెల్లింపు
20. ఉచిత బోర్ల పథకం కింద 200 రిగ్గులను కొనుగోలుకు నిర్ణయం
21. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శీతల గిడ్డంగి, వేర్‌హౌస్ ఏర్పాటుకు చర్యలు
22. త్వరలో సహకార రంగంలోని డైరీలకు పాలు పోసే రైతులకు లీటరుకు రూ. 4 బోనస్
23. సహకార సొసైటీల ఆధునీకరణ, అభివృద్ధికి రూ. 120 కోట్లు
24. ఇన్‌పుట్ సబ్సిడీ సకాలంలో అందేలా చర్యలు
25. త్వరలో చిరుధాన్యాల బోర్డు
26. ఆచరణలోకి రానున్న వ్యవసాయ ఉత్పాదకాల దుకాణాలు
27. త్వరలో బయోపెస్టిసైడ్స్ నియంత్రణ చట్టం
28. స్కూలు విద్యార్థుల కోసం స్థానిక రైతుల నుంచే కోడిగుడ్ల కొనుగోలుకు చర్యలు
29. టమాటా, ఉల్లి ధరల నియంత్రణకు పకడ్బందీ ఏర్పాట్లు
30. పగటి పూటే 9 గంటల విద్యుత్

ఆకుల అమరయ్య, సీనియర్ జర్నలిస్టు

# పండ్ల తోటల్లో చేపట్టవలసిన పనులు, సూచనలు..!

మామిడి పాదుల్లో కలుపు లేకుండా చేయాలి. ఆకు జల్లెడ గూడు కట్టు పురుగు కనిపిస్తే గూళ్ళను నాశనం చేసి క్వినాల్ ఫాస్ 2 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. లేత ఆకులు తినే ఆకుతేలు, బూడిద రంగులో ఉండే ముక్కు పురుగు, లేత ఆకుల నుండి రసం పీల్చే తేనె మంచు పురుగు, ఆకులను కత్తిరించే పెంకు పురుగు, రెమ్మ తొలిచే పురుగు, ఆకు తొలిచే పురుగుల ఉధృతిని గమనించి నివారణ చర్యలు చేపట్టాలి.



ఆకులపై వచ్చే ఆంత్రాక్నోస్ మచ్చలు, ఆకు అంచులను, చివరలను బూడిద రంగులోనికి మార్చే పెస్టలోషియా, ఆకులపై వచ్చే కుంకుమ రంగు మచ్చరోగం ఉధృతిని గమనించి అవసరమైతే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా./లీ చొప్పున పిచికారి చేయాలి. ప్రధాన కొమ్మలపై నిద్రావస్థలో ఉన్న మొగ్గలు చిగురిస్తాయి. వీటిని తొలగించాలి.అరటి తోటలలో కలుపు లేకుండా జాగ్రత్తపడాలి. తల్లి మొక్క చుట్టూ ఉన్న పిలకలను ఎప్పటికప్పుడు కోసివేయాలి. ఆకుమచ్చ తెగులు గమనించినట్లయితే ప్రొపికొనజోల్ 0.1 శాతం లేదా టెబుకొనజోల్ ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ 1.4 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి రెండు మూడుసార్లు 25 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి. తెల్లచక్కెరకేళి రకానికి రెండవ దఫా ఎరువులు వేయాలి.నిమ్మలో ఎండుకొమ్మలను కత్తిరించి 1 శాతం బోర్డోమిశ్రమాన్ని పిచికారి చేయాలి. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని లేత ఆకులపై పిచికారి చేయాలి. మంగునల్లి నివారణకు లీటరు నీటికి 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేక 1 మి.లీ. ప్రోపార్గైట్ లేదా ఇథియాన్ ఏ 1 మి.లీ. లేదా ఫెన్జాక్విన్ ఏ 1 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ ఏ 0.8 మి.లీ. గోలీకాయ దశలో ఒకసారి మరియు 20 రోజుల తరువాత రెండవ సారి పిచికారి చేయాలి. కాండం మొదల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కందెన మచ్చ తెగులు (గ్రీజీ స్పాట్) నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా టెబుకొనజోల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.ామలో ఎండుతెగులు ఆశించిన చెట్లకు 1 గ్రా. కార్బెండజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపిన మందు ద్రావణాన్ని చెట్టు మొదలు పాదుల్లో పోయాలి. పశువుల ఎరువుతోపాటు ఒక్కొక్క మొక్కకు 250 గ్రా. వేపపిండి-నులిపురుగుల గ్రుడ్లను ఆశించి నష్టపరిచే పాసిలోమైసెస్ లిలేసినస్ శిలీంద్రము 25 గ్రా. లేదా కార్బోఫ్యూరాన్ గుళికలు 60 గ్రా. వేయాలి.సపోటాకు అవసరాన్ని బట్టి నీటి తడులు ఇవ్వాలి. పూత మొదలయ్యేటప్పుడు మొగ్గ తొలుచు పురుగు నివారణకు వేపగింజల కషాయం 5% లేదా వేపనూనె (0.15%) 5 మి.లీ./లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఉధృతి అధికంగా ఉన్నపుడు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి చిగుర్ల దశలో పురుగు మందులను మార్చి పిచికారీ చేయాలి.దానిమ్మ తోటల్లో అంతరకృషి చేసి, చెట్ల పాదుల్లో త్రవ్వకం చేసి కలుపు మొక్కలు లేకుండా శుభ్రం చేయాలి.

రేగులో కాయదొలుచు పురుగు నివారణకు పాలిట్రిన్ 1 మి.లీ. లేదా డెల్టామెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి 2-3 దఫాలుగా బఠాణి గింజ సైజు నుండి 10 రోజుల వ్యవధిలో అవసరం మేరకు మందులను కాయ పక్వానికి రావటం మొదలయ్యే ముందు వరకు పిచికారి చేయాలి.

బొప్పాయిలో సూక్ష్మధాతులోప నివారణకు 2.5 గ్రా. జింక్ సల్ఫేట్ మరియు 1 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి కలిపి ఆకులపై పిచికారి చేయాలి. పండు ఈగ నివారణకు మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరానికి 4%--%5 చొప్పున అమర్చాలి.బొప్పాయిలో జూలై-ఆగష్టు నెలల్లో పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. ఒక మొక్క నుండి సంవత్సరానికి 700-800 గ్రా. పపెయిన్ లభ్యమవుతుంది. పపెయిన్‌ను తీసిన కాయలను టూటీ ఫ్రూటీ తయారీకి ఉపయోగించవచ్చు.సీతాఫలంలో పిండినల్లి నివారణకు 1 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఆస్ట్రేలియన్ అక్షింతల పురుగులను (బదనికలు) తోటలలో వదలాలి. 50 గ్రా. ఫాలిడాల్ పొడి మందును చెట్టు పాదులో వేయాలి.ద్రాక్ష తోటలలో పక్షికన్ను మరియు బూడిద తెగలు కన్పించిన వెంటనే డైఫెన్‌కొనజోల్ 25% ఇ.సి.0.6 మి.లీ./లీ. గాని లేదా టెబుకొనజోల్ 25.9 యం/యం ఇ.సి.- 0.25 మి.లీ./లీ. లేదా క్రిసోక్సిమ్ మిథైల్ 44.3% ఎస్.సి.-.6 మి.లీ./లీ. లేదా ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ 25%టెబుకొనజోల్ (50%) 75 డబ్ల్యు.పి.0.25 గ్రా./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉసిరిలో తామర పురుగు నివారణకు 2 మి.లీ. ఫిప్రోనిల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.పనసలో కాయలను కోసిన తరువాత ఎండిన రెమ్మలను తీసివేసి కాండం మీద వెలుతురు పడే విధంగా కొమ్మలను కత్తిరించి మరల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును 3 గ్రా. చొప్పున పిచికారి చేసుకొని ఎరువులను వేసి తడిపెట్టాలి.

తోటపంటలు:జీడిమామిడి తోటలలో జూలై నెలలో కొమ్మ కత్తిరింపులు చేయనట్లయితే ఈ నెలలో చేసుకోవాలి. జూలై నెలలో ఎరువులు వేయడం కుదరని పక్షంలో ఈ నెలలో వేసుకోవాలి. వర్షాధార జీడి తోటలలో మొక్కకు వేయవలసిన మొత్తం మోతాదు ఎరువులను ఒకేసారి వేసుకోవాలి.కొబ్బరి చెట్టుపైభాగము శుభ్రం చేసుకోవాలి. అవసరమైనచో నీరు పెట్టవలెను. కొబ్బరిపై ఆశించు ఎర్రముక్కు పురుగు, మొవ్వ కుళ్ళు మరియు నల్లమచ్చ తెగులు ఉనికిని పరిశీలిస్తూ ఉండాలి.

**ఎర్రముక్కు పురుగు యాజమాన్యము:** ఈ పురుగు ఆశించి చనిపోయిన మానులను సత్వరమే నరికి, చీల్చి తగులబెట్టాలి. ఎర్రముక్కు తల్లి పురుగులను గుంపుగా ఆకర్షించు కృత్రిమ ఎరను బక్కెట్లో ఉంచి, కొబ్బరి చెట్టు కాండమునకు 1 1/2 మీటర్ల ఎత్తులో అమర్చినచో, ఎర్రముక్కు తల్లి పురుగులు ఆకర్షితమయ్యి, బక్కెట్ లోపల గల విషాహారములో పడి చనిపోతాయి. సగం డొల్ల అయిన కాండములోని చెత్త, కుళ్ళు పదార్థమును శుభ్రం చేసి, పుండుపై కోల్‌తార్ లేక జపాన్ బ్లాక్‌ను పూతగా పూయాలి. చెట్టు తొఱ్ఱను సిమెంట్, ఇసుక, కంకర రాళ్ళ మిశ్రమముతో పూడ్చినచో, చెట్టు బలంగా ఉండి, పెద్ద గాలులు వచ్చినపుడు పడకుండా ధృఢంగా ఉంటుంది.



**మొవ్వుకుళ్ళు తెగులు యాజమాన్యం:** మొవ్వభాగం తడిచేలా కాపర్ ఆక్సీక్లోరైడ్ మందు (3 గ్రా./లీ. నీటిలో కలిపి) పిచికారి చేయాలి. కాయకుళ్ళు సోకిన గెలను తొలగించి, ఇతర గెలలు, మొవ్వభాగం తడిచేలా కాపర్ ఆక్సీక్లోరైడ్ మందు (3 గ్రా./లీ. నీటిలో కలిపి) పిచికారి చేయాలి.

**జీవనియంత్రణ పద్ధతి:** కొబ్బరి మొక్క మొవ్వభాగంలో సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ టాల్క్ పొడిని వేయాలి. మొక్క వయస్సును బట్టి సంవత్సరం లోపు మొక్కకు 5 గ్రా. ఒక సంవత్సరం మొక్కకు 10 గ్రా. అదే విధముగా 2,3,4,5 మరియు 5 సంవత్సరముల కంటే ఎక్కువ వయసు గల మొక్కలకు 75,100,150,200 గ్రా. సుడోమోనాస్ టాల్క్ పొడిని వేయాలి. కాయకుళ్ళు సోకిన గెలను తొలగించి, ఇతర గెలలు, మొవ్వభాగం తడిచేలా సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ కల్చర్ ద్రావణాన్ని పిచికారి చేయాలి. నల్చమచ్చ తెగులు యాజమాన్యం: కొబ్బరి కాండముపై ఎటువంటి గాయము కలిగించరాదు. ఈ తెగులు లక్షణాలు కాండముపై కనిపించిన వెంటనే, ఆ భాగముపై ట్రైకోడెర్మా విరిడి శిలీంధ్రపు పొడిని పేస్ట్‌గా తయారుచేసి పూయవలెను (50 గ్రా. పొడికి 25 మి.లీ. నీటిని కలిపిన పేస్ట్ తయారగును).తమలపాకు మొదటి సంవత్సరం తమలపాకు తోటలలో అవిశ మొక్కల మధ్య సాళ్లను చేసి సాళ్ల మధ్య మట్టిని చెక్కి అవిశ మొదళ్ల వద్దవేసి, కయ్యలు చేసి వాటి వద్ద 5 సెం.మీ లోతు 20 సెం.మీ దూరంలో ఎకరాకు 20,000 తమలపాకు తీగలను ఎన్నుకొని (6 నుండి 8 కణుపులు ఉండేటట్లు) నాటాలి. తీగలను నాటే ముందు 0.5 శాతం బోర్డో మిశ్రమం 250 పి.పి.ఎం. స్ట్రెప్టోసైక్లిన్ (250 మి.గ్రా లీటరు నీటికి) కలిపిన ద్రావణంలో 15-30 నిమిషాలు ముంచి శుద్ధిచేసి (100%×%20 సెం.మీ. దూరంలో) నాటుకోవాలి.విత్తనపు తీగను ఆరోగ్యవంతమైన తోట నుండి సేకరించాలి. తీగ నాటుటకు ముందే నీరు పెట్టడానికి అదే విధంగా మురుగు నీరు పోయే కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. 8-10 మీ. పొడవు సాలుకు ఒక పులక కాలువ ఉండేలా చూసుకోవాలి. అవిశలో కాండం తొలుచు పురుగు నివారణకు దీపపు ఎరలను ఏర్పాటు చేయాలి. రెండవ సంవత్సరం తోటలలో మొదటి సంవత్సరపు తోటలలో చేపట్టిన పనులు చేయాలి. ఆకులను ప్రతి నెలలో ఒకసారి కోయాలి. దానితో పాటుగా తీగలను దింపకం చేయాలి.



క్యాబేజీ మరియు కాలీఫ్లవర్ (మధ్యకాలిక రకాల) నారును పోసుకొనే సమయం. కాప్సికం పాలీహౌస్‌లో సాగు చేసుకొనే కాప్సికం నారును నాటుకోవాలి. వంగ మరియు బెండ పంటలలో మొవ్వు మరియు కాయతొలుచు పురుగు నివారణకు తలవాల్చిన కొమ్మలను త్రుంచి, పుచ్చు కాయలను ఏరి నాశనం చేయాలి. ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా సైపర్ మెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి రెండుసార్లు 10 రోజుల వ్యవధిలో కాయలు కోసిన తర్వాత పిచికారీ చేయాలి.కందకు రెండవ పక్షంలో (80 రోజులకు) రెండవ దఫా 33 కిలోల నత్రజని, 33 కిలోల పొటాష్ ఎరువులు (72 కిలోల యూరియా, 55 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేయాలి. అన్నబేధి 5 గ్రా., నిమ్మఉప్పు 1గ్రా., జింక్ సల్ఫేటు 3 గ్రా., మెగ్నీషియం సల్ఫేటు 3 గ్రా., ఎలిగారం (బోరాన్) 3 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి అవసరాన్ని బట్టి 10 రోజుల వ్యవధిలో 2 నుండి 3 సార్లు పంటపై పిచికారి చేయాలి. వర్షాకాలంలో ఆకుమచ్చ తెగులును గమనించినట్లయితే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.మునగ వార్షిక రకాలకు ఎకరానికి 250 గ్రా. గింజలను పాలిథీన్ సంచులలో గాని నేరుగా పొలంలో గాని విత్తుకోవాలి. పాలిథీన్ సంచులలో విత్తిన విత్తనాలను 35-40 రోజుల తర్వాత ప్రధాన పొలంలో నాటుకోవాలి. విత్తనాలు మొలకెత్తడానికి 10-15 రోజుల సమయం పడుతుంది. బహువార్షిక రకాలను కూడా ఈ నెలలో నాటుకోవచ్చు. బహువార్షిక రకాలను 5-8 సెం.మీ. మందం మరియు 90-100 సెం.మీ. పొడవు గల కొమ్మ కత్తిరింపుల ద్వారా వ్యాప్తి చేయవచ్చు. ఎకరానికి 160 కాండం ముక్కలు కావాలి. పెండలంలో నాటిన 4045 రోజుల తరువాత కూలీలతో కలుపు తీయించాలి. రెండవ దఫాగా ఎకరానికి 28 కిలోల యూరియా, 18 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి తేలికపాటి తడి ఇవ్వాలి. చేమగడ్డలో వర్షాలు అధికమై గాలిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఆకుమచ్చ తెగులు త్వరగా వృద్ధి చెంది, ఎక్కువ నష్టాన్ని కలుగజేస్తుంది. దీని నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లేదా కార్బెండజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధితో 2 సార్లు పిచికారి చేయాలి లేదా మెటలాక్సిల్ ఎమ్.జడ్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి 20 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేసి తెగులును అరికట్టవచ్చును.ఉల్లిలో బోదెలు 30 సెం.మీ. ఎడంలో చేసి బోదెకు రెండువైపులా 10 సెం.మీ. ఎడంలో నాటుకోవాలి. నారును 20 మి.లీ. మలాథియాన్ 10 గ్రా. కార్బెండజిమ్ 10 లీ. నీటిలో కలిపిన ద్రావణంలో 20 నిమిషాలు ముంచి నాటితే చీడపీడల బాధ తగ్గుతుంది. ఖరీఫ్ కాలంలో ఆగష్టు నెలలో మొదటి 15 రోజుల్లో, రబీలో డిసెంబర్ మొదటి పక్షంలో నాటుకుంటే మంచి దిగుబడులు వస్తాయి.కర్రపెండలం మొక్క చుట్టూ మొలిచిన కలుపును కూలీలతో తీయించి, మిగతా కలుపును ఎద్దులతో నడిచే గొర్రుతో లేదా పవర్‌వీడర్‌తోగాని అంతరకృషి చేయాలి. రెండవ పక్షంలో (నాటిన 60 రోజులకు) రెండవ దఫా ఎకరాకు 8 కిలోల నత్రజని మరియు 8 కిలోల పొటాష్ ఎరువులు (17.5 కిలోల యూరియా మరియు 13.5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) మొక్కకు రెండువైపులా గుంతల్లో వేసి మట్టితో కప్పాలి. ఎరువులు వేసిన వెంటనే తేలికపాటి తడి ఇవ్వాలి. మొక్కకు బలంగా ఎదురెదురుగా వున్న రెండు కొమ్మలను ఉంచి మిగిలిన వాటిని తొలగించాలి. ప్రతి మొక్క చుట్టూ గొప్పు చేసి, మొక్క మొదట్లోకి మట్టిని ఎగదోయాలి. తెల్లదోమను నివారించడానికి డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లేదా ప్రొఫినోఫాస్ లేదా ట్రైజోఫాస్ 2 మి.లీ. లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్ల మందు ద్రావణాన్ని 15%--%20 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**పూల తోటలు:**గులాబి తోటల్లో వచ్చే నల్లమచ్చ మరియు ఆకు తినే పురుగు నివారణకు మచ్చలు ఆశించిన ఆకులను తీసివేసి కార్బెండజిమ్ 1 గ్రా. మరియు మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.చామంతిలో నీరు నిలువ ఉండకుండా చూడాలి. మట్టిని ఎగదోసి పైపాటుగా వాము పంటకు నేలను 2-3 సార్లు దున్ని తయారుచేసుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరాకు 5 టన్నుల పశువుల ఎరువుతో పాటు, 15 కిలోల యూరియా, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసుకోవాలి.పసుపులో కలుపుతీత, అంతర కృషి చేపట్టాలి. విత్తిన 30 రోజులకు మొదటి దఫా నత్రజని ఎరువు యూరియా రూపంలో ఎకరానికి 50 కిలోలు అదే మోతాదు వేపపిండితో కలిపి వేయాలి. అధిక తేమ శాతం వల్ల ఆశించే ఇనుపధాతు లోపమును 10 లీటర్ల నీటికి 50 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్/100 గ్రా. అన్నబేధిని 5 గ్రా. నిమ్మఉప్పుతో పాటు 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. ఆకులు ముదురు, లేత ఆకుపచ్చ చారలతో కనిపించినప్పుడు జింకుధాతు లోపముగా గుర్తించి లీటరుకి 5 గ్రా. జింక్ సల్ఫేట్‌ను 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి. పొగచూరు లక్షణాలతో నల్లి సోకినట్లయితే 3 గ్రా. నీటిలో కరిగే గంధకము లేదా 5 మి.లీ. డైకోఫాల్ లేదా 3 మి.లీ. జోలోన్ మరియు 0.5 మి.లీ. జిగురు లీటరు నీటికి కలిపి ఆకుల అడుగు భాగం తడిచేలా పిచికారి చేయాలి. ఆకుమచ్చ తెగులు ఆశించినట్లయితే తగు సస్యరక్షణ చేపట్టాలి.మిరపలో సాలు తోటలకై రెండవ వారం వరకు విత్తనాన్ని ఎదబెట్టుకోవచ్చును. జూలైలో ఎదబెట్టిన సాలు తోటల్లో ఒత్తు పీకి, పాదుల మధ్య 30-45 సెం.మీ. దూరం ఉండేటట్లు చూడాలి. మొదటి దఫా ఎరువులను (65 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేయాలి. ఆరువారాల వయస్సుగల నారును ప్రధాన పొలంలో నాటుకోవాలి. సూటి రకాలైతే పాదుకు రెండు మొక్కలు, సంకర రకాలైతే పాదుకు ఒక మొక్క చొప్పున నాటుకోవాలి. సాళ్ళ మధ్య 75 సెం.మీ., పాదుల మధ్య 30-45 సెం.మీ. ఎడం ఉండేటట్లు చూసుకోవాలి.నాటుటకు 10 రోజుల ముందే పొలంచుట్టూ 2-3 వరుసలలో జొన్న/ మొక్కజొన్నను రక్షక పంటగా విత్తుకోవాలి. పొలంలో అక్కడక్కడ ఆముదం, బంతి మొక్కలను ఆకర్షక పంటలుగా వేయాలి. నారువేర్లను ఇమిడాక్లోప్రిడ్ (5 మి.లీ./10 లీ.) మరియు కార్బెండజిమ్ (10 గ్రా./10 లీ.) కలిపిన మందు ద్రావణంలో 20 నిమిషాలు ముంచిన తరువాత నాటుకోవాలి.

## ఈ 5 నగరాలను ఓసారి లుక్కేయండి..

# వీలైతే వెళ్లి చూడండి..!








ఎప్పుడూ చూసే పర్యాటక ప్రదేశాలు కాకుండా ఈసారి ప్రపంచంలోని కొన్ని అద్భుతమైన నగరాల గురించి తెలుసుకుందాం. అవెలా ఉంటాయి. వాటి ప్రత్యేకలతేంటి చూద్దాం.

ప్రపంచంలో ఎన్నో అందమైన నగరాలు ఉన్నాయి. నిత్యం వివిధ దేశాల నుండి పర్యాటకులను రారమ్మని ఆహ్వానిస్తుంటాయి. దీంతో చాలా మంది ట్రావెలర్లు ఆయా ప్రదేశాలకు వెళ్లి అక్కడి అనుభూతులను మనసారా ఆస్వాదిస్తారు. అలాంటి నగరాల్లో కొన్ని చాలా ప్రత్యేకమైనవి కూడా ఉంటాయి. అందులో ఈ 5 నగరాలు సైతం ప్రపంచ టూరిస్టుల మనసు గెలుచుకున్నాయి. కొద్ది రోజులు అక్కడ ఉండి స్థానిక సంస్కృతి సంప్రదాయాలు తెలుసుకొని వారు ప్రత్యేక అనుభూతికి గురయ్యారు. మీరు కూడా అలాంటి ప్రత్యేకమైన నగరాలేవో.. అక్కడున్న విశేషాలేంటో తెలుసుకోవాలనుకుంటే ఈ సమాచారం మీకోం. (%ళాష్ట్రశీశీ జతీవసఱ: ఖఅంజూశ్రీఖంష్ట్ర)

%సరాజేవో, బోస్నియా..

సరాజేవో, బోస్నియా.. బోస్నియాలోని సరాజేవో ప్రపంచంలోని అందమైన నగరాల్లో ఒకటి. నగరం చుట్టూ ప్రకృతి దృశ్యాలు కనువిందు చేస్తాయి. అలాగే ఈ నగరంలో గత కాలానికి చెందిన చేదు జ్ఞాపకాలు కూడా కనిపిస్తుంటాయి. అయితే, ఇప్పుడు ఈ సరాజేవో భిన్న సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా మారింది. దీంతో ప్రజలు చాలా ప్రశాంతంగా ఉన్నారు. అక్కడ చర్చిలు, మసీదులు, ప్రార్థనా మందిరాలు దాదాపు ఒకదాని పక్కన మరొకటి కనిపించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. అందుకే ఈ నగరాన్ని "యూరోపియన్ జెరూసలేం" అని పిలుస్తారు.

ఏథెన్స్, గ్రీస్..

ప్రపంచంలోని అతి పురాతన నగరాల్లో ఒకటి గ్రీస్‌లోని ఏథెన్స్. ఇదో అద్భుతమైన, చారిత్రకమైన నగరం. ఇప్పటికీ అక్కడ అనేక చారిత్రక అవశేషాలు కనిపిస్తుండటం విశేషం. అలాగే అక్కడి పార్క్‌లు, బీచ్‌లు, అద్భుతమైన నిర్మాణాలు, సుందరమైన ప్రదేశాలు పర్యాటకులను మైమరపిస్తుంటాయి. రెండు దశాబ్దాలుగా అక్కడి మౌలిక సదుపాయాలు కూడా మెరుగుపడటంతో టూరిజం రంగంలోనూ మంచి గుర్తింపు సాధించింది. దీంతో ఈ చారిత్రక నగరాన్ని ఒక్కసారైనా చూసితీరాల్సిందే.

బాన్స్కో, బల్గేరియా..

బల్గేరియాలోని బాన్స్కో అనే నగరం అత్యంత అందమైనదని చెప్పొచ్చు. ఇది పిరిన్ నేషనల్ పార్క్‌లో భాగమైన పిరిన్ హిమాలయ పర్వతాల దిగువన ఉండే అద్భుతమైన పర్యాటక ప్రదేశం. ఇక్కడ ఉండే టోడోర్కా శిఖరం అనేక కార్యకలాపాలకు ప్రసిద్ధి చెందింది. దీంతో ఇక్కడికి వచ్చే పర్యాటకులు మంచు అందాల్లో తడిసిముద్దవుతారు. స్కీయింగ్, స్నోబోర్డ్ వంటి సాహస క్రీడలు ఆస్వాదించేవారికి ఇదో స్వర్గధామం అని చెప్పొచ్చు. అలాగే పిరిన్ నేషనల్ పార్క్‌లోని క్రాగీ ఆల్పైన్ చెట్ల అందాలు, సమీపంలో అండే హిమనీ సరస్సులు, ఎత్తైన పర్వత శిఖరాలు ఎవరికైనా తప్పక నచ్చుతాయి.

టోక్యో, జపాన్..

జపాన్‌లోని టోక్యో ప్రపంచంలోనే అద్భుతమైన ఎలక్ట్రానిక్ సిటీ అని చెప్పొచ్చు. అక్కడ రాత్రివేళ ఏ మూలకెళ్లినా కళ్లు జిగేల్ మనే విద్యుద్దీపాల అందాలే కనువిందు చేస్తాయి. ముఖ్యంగా టోక్యోలో చూడాల్సిన వాటిల్లో స్కై ట్రీ, షిబుయా క్రాసింగ్, సకురా ట్రీ లైన్డ్ స్ట్రీట్స్ తప్పక ఉంటాయి. అలాగే అక్కడి అందమైన పార్కులు, ఆలయాలు, సంస్కృతి సంప్రదాయాలు కూడా తప్పక ఆస్వాదించాల్సినవే. అలాగే ముందుగా చెప్పినట్లు ఈ నగరంలో ఎలాంటి ఎలక్ట్రానిక్ ప్రాడక్ట్స్‌కైనా దొరుకుతాయి.

మెర్‌జౌగా, మొరాక్కో..

మొరాక్కోలోని మెర్‌జౌగా అనేది అద్భుతమైన ఎడారి ప్రాంతం. ఇక్కడికి చాలా మంది పర్యాటకులు వచ్చి సేద తీరుతుంటారు. ఇది సహారా ఎడారికి ప్రధాన ద్వారం అని కూడా చెప్పొచ్చు. అలాగే ఇక్కడ తప్పక సందర్శించాల్సిన వాటిల్లో ఎర్గ్ చెబ్బీ ప్రధానమైన ఎడారి ప్రాంతం. అక్కడ పర్యాటకులు వివిధ రకాల కార్యకాలపాలను ఆస్వాదిస్తారు. సాండ్ డ్యూన్స్‌లో ట్రెక్కింగ్, క్యాంపింగ్, హైకింగ్, సఫారీ రైడ్లు ఆస్వాదిస్తుంటారు. దీంతో ఇది కేవలం అందమైన ప్రదేశంగానే కాకుండా మంచి సాహసయాత్రగానూ మిగిలిపోతుంది.

## హాలీ డే ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా?

# వీసా లేకుండానే ఈ దేశాలు చుట్టేయండి

హాలీ డేస్ అనగానే చాలామంది టూర్స్ ప్లాన్ చేస్తుంటారు. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి సరదాగా హాలీ డే ట్రిప్ వేస్తుంటారు. ఒక్కో ఏడాది ఒక్కో ప్రాంతానికి వెళ్తూ ఎంజాయ్ చేస్తుంటారు.

కొంతమందికి అయితే భారత్‌తో పాటు విదేశాల్లోని ప్రాంతాలను కూడా తిరిగి రావాలని కొంతమందికి కోరిక ఉంటుంది. కానీ విదేశాలకు వెళ్లాలంటే పాస్‌పోర్టు, వీసా కావాలి.. దీనికి చాలా తతంగం ఉంటుందనే ఆలోచనతో చాలామంది వెనక్కి తగ్గుతుంటారు. చూసిన ప్లేస్‌లు అయినా సరే మళ్లీ మళ్లీ వెళ్లొస్తుంటారు. కానీ వీసాతో పని లేకుండా స్వేచ్ఛగా తిరిగి రావడానికి కొన్ని దేశాలు భారతీయులను ఆహ్వానిస్తున్నాయని తెలుసా! మన వాళ్లకు ఆయా దేశాలే ఈ వీసాలు, వీసా ఆన్ అరైవల్ ఏర్పాటు చేస్తున్నాయి. మరి ఆ దేశాలేంటో ఒకసారి చూద్దామా..

### మాల్దీవులు

హాలీ డేస్‌లో రిలాక్సేషన్‌కు మాల్దీవులు చక్కటి ప్లేస్ అని చెప్పొచ్చు. ముఖ్యంగా హనీమూన్‌కు వెళ్లే కొత్త జంటలకు ఇది చాలా ఫేమస్. టూరిస్టులు చూసేందుకు, ఎంజాయ్ చేసేందుకు ఇక్కడ చాలా ప్రదేశాలు ఉంటాయి. ఎన్నో అడ్వెంచరస్ గేమ్స్ కూడా ఆడేందుకు అవకాశం ఉంటుంది. అందుకే కాస్త ఖర్చయినా సరే చాలామంది మాల్దీవులను ప్రిఫర్ చేస్తుంటారు. అయితే మాల్దీవులకు వెళ్లాలంటే వీసా ఉండాలని చాలామంది అనుకుంటుంటారు. కానీ అక్కర్లేదు. భారతీయుల కోసం అక్కడి ప్రభుత్వం వీసా ఆన్ అరైవల్ సమకూరుస్తోంది. ఈ విధానం ప్రకారం ఎలాంటి ఛార్జీలు లేకుండానే వీసాలను పొందవచ్చు. 30 రోజుల నుంచి 90 రోజుల కాలపరిమితితో ఈ వీసా పొందవచ్చు.

### బ్యాంకాక్ ( థాయిలాండ్ )

వెకేషన్ అనగానే చాలామంది నోట వినిపించే పేరు థాయిలాండ్. కుర్రకారు నుంచి పెద్దవాళ్ల దాకా ఒక్కసారైనా బ్యాంకాక్ వెళ్లి ఎంజాయ్ చేసి రావాలని అనుకుంటుంటారు. థాయిలాండ్‌లో ఒక్క బ్యాంకాక్ మాత్రమే కాదు.. క్రిబి, ఫుకెట్, ఫిఫి దీవులు కూడా పర్యాటకులను విపరీతంగా ఆకర్షిస్తుంటాయి. ఇక్కడికి హాలీ డే ట్రిప్ వెళ్లాలని అనుకుంటే ఎలాంటి వీసా అక్కర్లేదు. థాయిలాండ్ వెళ్లిన తర్వాత కేవలం 35 అమెరికన్ డాలర్లు చెల్లించి టూరిస్ట్ వీసా తీసుకోవచ్చు. ఈ వీసాతో 15 రోజుల పాటు థాయిలాండ్‌లోని అన్ని దీవులు తిరిగేసి రావొచ్చు.

### ఇండోనేసియా

అందమైన బీచ్‌లకు, నోరూరించే వంటకాలకు ఇండోనేసియా ఫేమస్ అని చెప్పొచ్చు. ఇక్కడి సముద్ర తీరంలో సేద తీరేందుకు ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడికి వెళ్లాలంటే కూడా ముందుగా వీసా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇండోనేసియా వెళ్లిన తర్వాత దాదాపు 30 అమెరికన్ డాలర్లు చెల్లించి టూరిస్ట్ వీసా పొందవచ్చు. దీని కాలపరిమితి రెండు నెలలు ఉంటుంది.

### కాంబోడియా

ప్రకృతి ప్రేమికులకు కాంబోడియా వీనుల విందును కలిగిస్తుంది. ఇక్కడ అడవులు, చెట్లతో పాటు పురాతన బౌద్ధ ఆలయాలు, కోటలు, బురుజులు విపరీతంగా ఆకట్టుకుంటాయి. ఇక్కడికి వెళ్లాలని అనుకుంటే ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి ఈ- వీసా పొందవచ్చు. లేదా కాంబోడియా వెళ్లిన తర్వాత 30 రోజుల గడువుతో వీసా తీసుకోవచ్చు.

### శ్రీలంక

భారత్‌కు దక్షిణ దిక్కున ఉన్న శ్రీలంక ప్రకృతి అందాలకు నెలవు. ఇక్కడి విభిన్న వృక్ష జాతులు, దట్టమైన అడవులు, బీచ్‌లు ఈ ప్రాంతానికి పేరు తీసుకొస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ట్రావెల్ ఆథరైజేషన్ పద్ధతిలో శ్రీలంకకు అనుమతిస్తారు. ఆన్‌లైన్‌లో దాదాపు 30 డాలర్లు చెల్లించడం ద్వారా ఈ వీసాను పొంది.. నెల రోజుల పాటు శ్రీలంకలో తిరిగి రావొచ్చు.

### నేపాల్

హిమాలయాలలో ఉన్న నేపాల్ ప్రకృతి అందాలకు నెలవు. ఇక్కడి లేక్ టేబుల్ ల్యాండ్ పర్యాటకుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తుంది. ఈ దేశానికి వెళ్లాలంటే పాస్‌పోర్టు కూడా అవసరం లేదు. ఏదైనా గుర్తింపు పత్రం చూపిస్తే సరిపోతుంది. భారతీయులకు ఎలాంటి షరతులు విధించరు.

### భూటాన్

ఈ దేశం సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుంది. కలుషితం కాని ప్రకృతి సౌందర్యాన్ని ఇక్కడ చూడవచ్చు. ఇక్కడి కట్టు, బొట్టు అన్నీ ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ఇక్కడకు వెళ్లాలంటే వీసా అక్కర్లేదు. గడువు కూడా లేదు.

### మారిషస్



వాటర్‌ఫాల్స్, దట్టమైన అడవులు, బ్ల్యూ బే మెరీనా పార్క్, పీటర్ బోత్ కొండలు, నేచుర్ పార్క్ చూడదగిన ప్రదేశాలు. ఈ దేశంలో వీసా లేకుండా 90 రోజులు ఉండవచ్చు.

### వియత్నాం

చారిత్రక ప్రదేశాలు, ఆలయాలు అంటే ఆసక్తి ఉన్నవాళ్లు వెళ్లేందుకు వియత్నాం చక్కటి ప్రదేశం. భారత్ నుంచి వచ్చే టూరిస్టుల కోసం ఇక్కడే తక్కువ ధరలో వీసాలను అందిస్తున్నారు. 30 రోజుల నుంచి 90 రోజుల వరకు బస చేసేందుకు వీలుగా ఇక్కడ వీసాలు పొందవచ్చు. దీనికోసం దాదాపు రూ.7800 చెల్లించాల్సి ఉంటుంది.

ఇవే కాదు ఇంకా చాలా దేశాలు వీసాలు లేకుండా భారతీయులను తమ దేశానికి ఆహ్వానిస్తున్నాయి. ఆయా దేశాలకు వెళ్లిన తర్వాత వీసాలు పొందే ఛాన్స్ ఇస్తున్నాయి. ఆ జాబితా కోసం ఇక్కడ క్లిక్ చేయండి.